Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 20.07.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 07 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## జోడుగుర్రాలపై...
# నారా వారి సవారీ

- కాంగ్రెస్‌తో కొత్త స్నేహం
- బీజేపీతో తెరచాటు బంధం
- అవిశ్వాసంలో టీడీపీకి ఇరుపార్టీల సహకారం



***ఎన్నికలొచ్చేసరికి ఏదో ఒక పార్టీ తోడు వెదుక్కోవటం చంద్రబాబు నైజం. పొత్తు లేకుండా ఆయన ఒంటరిగా ఎన్నికలకు పోయిన సందర్భమే లేదు. 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనల సహకారంతోనే ఆయన అధికారంలోకి వచ్చాడన్నది బహిరంగ సత్యం. మరి వచ్చే ఎన్నికల్లోనూ పొత్తు లేకుండా ముందుకు పోగలడా? 2014 ఎన్నికల్లో ఆయనకు సహకరించిన బీజేపీ, జనసేనలు రెండూ కూడా ఇప్పుడు టీడీపీకి వ్యతిరేకంగా వున్నాయి. ఆ పార్టీలు సొంతంగా పోటీ చేస్తే ఓట్ల చీలిక ఖాయం. చంద్రబాబు అంత దూరం రానిస్తాడా? ఎన్నికల సమయానికి ఏదో ఒక పార్టీతో అంటకాగకుండా వుంటాడా?***

చంద్రబాబు ఇప్పుడు జోడుగుర్రాల మీద సవారీ చేస్తున్నాడు. ఎన్డీఏ నుండి బయటకొచ్చాక ఈమధ్య కాంగ్రెస్‌తో స్నేహం పెరిగింది. కాంగ్రెస్‌ను అప్పుడప్పుడూ పొగుడుతున్నాడు కూడా! ఏపిలో కాంగ్రెస్ తిరిగి బలం పుంజుకుంటే వైకాపా ఓట్లు చీలతాయనే ఉద్దేశ్యంతో ఆ పార్టీ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నాడు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేసే విధంగా, తద్వారా వైసిపి ఓట్లు చీల్చే పద్ధతిలో ప్లాన్ చేసాడు. ఇప్పుడు పాత స్నేహితుడు కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో చంద్రబాబు ప్లాన్‌ను అమలు చేయడం పెద్ద కష్టమేమీ కాదు.

చంద్రబాబుకు కాంగ్రెస్ లైన్‌లోనే వుంది. చంద్రబాబు కంటే జగన్ ఓడిపోవడమే వారి లక్ష్యం. ఇక బీజేపీ, జనసేనలనే తిరిగి దారిలోకి తెచ్చుకోవాల్సి వుంది. పేరుకు బీజేపీ, టీడీపీలు నాటకాలాడుతున్నాయి గాని, ఈ రెండు పార్టీల మధ్య లోపాయికారిగా మిత్రత్వం కొనసాగుతూనే వుంది. రేపు ఒకవేళ చంద్రబాబుతోనే అవసరం పడుతుందేమోనన్న ముందుచూపుతో బీజేపీవాళ్ళు కూడా ఆయనపై దూకుడుగా పోవడం లేదు. రాష్ట్రంలో చంద్రబాబు అవినీతిపై ప్రవాహంలా విమర్శలు చేస్తున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకులే (మిగతా 11వ పేజీలో)



### జగన్‌కు వ్యతిరేకంగా చేతులు కలిపిన...
# పప్పు.. నిప్పు.. చెప్పు

- కిరణ్ చేరికతో కాంగ్రెస్‌కు ఒరిగేదేమీ లేదు

**2014**లో ఆంధ్రప్రదేశ్ విభజన దారుణాతి దారుణంగా జరిగింది. ఏపిని ఏపి ప్రజలను నిలువునా ముంచారు. ఈ ద్రోహంలో ప్రధాన ముద్దాయి కాంగ్రెస్‌పార్టీ. రెండో ముద్దాయి బీజేపీ, మూడో ముద్దాయి విభజనకు అనుకూలంగా లేఖ ఇచ్చిన తెలుగుదేశం. అయితే వీరందరికీ మించి (మిగతా 11వ పేజీలో)

# ఇన్‌ఛార్జ్‌లతో ఇబ్బంది

- వైసిపిలో కొత్తగా చేరే నాయకులకు బ్రేకులు వేస్తున్న పాత నేతలు



**రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో ఒక కొత్త సమస్య మొదలైంది. అదే నియోజక వర్గాల ఇన్‌ఛార్జ్‌ల సమస్య. నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు టిక్కెట్ల కోసం ముందువరుసలో నిలుస్తుండడంతో పార్టీలో కొత్తగా చేరాలనుకున్నవారికి పలు ఆటం కాలెదురవుతున్నాయి.**

గత ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ 67 అసెంబ్లీ స్థానాలలో, 8 లోక్‌సభ స్థానాలలో గెలవడం తెలిసిందే! పార్టీ ఓడిపోయిన చోట్ల చాలావరకు ఓడిపోయిన అభ్యర్థులనే నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లుగా పెట్టారు. ఆ తర్వాత 23 మంది వైసిపి ఎమ్మెల్యేలు తెలుగుదేశంలోకి వెళ్ళగా, వారి స్థానాలలో అప్పటికప్పుడు ద్వితీయశ్రేణి నాయకులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించడం జరిగింది. ఇన్‌ఛార్జ్ అంటే ఆ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు (మిగతా 11వ పేజీలో)



# రిజిస్ట్రేషన్ బాదుడు..

ప్రభుత్వ శాఖలలో అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే శాఖలలో ఒకటైన రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలపై భారం మోపి తద్వారా ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మొత్తంమీద దాదాపు 5శాతం స్థిరాస్థి విలువలు పెంచనున్నట్లు సమాచారం. ఈ పెంచిన స్థిరాస్థి విలువలు ఆగస్టు1వ తేదీ నుంచి అధికారికంగా అమలులోనికి రానున్నాయి. పెంచిన స్థిరాస్థి విలువ ప్రకారం జిల్లాలో మొత్తం రిజిస్ట్రేషన్ పరంగా చూస్తే నెల్లూరు జిల్లా, గూడూరు జిల్లాగా రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ లు వున్నాయి. వీటిలో మొత్తం 19 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వున్నాయి.వీటిలో పట్టణ, నగర ప్రాంతాల్లోని కార్పొరేషన్, మునిసిపల్ ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో పెంచనున్నారు. నెల్లూరు ప్రధాన సబ్ రిజిస్ట్రార్, నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, బుజబుజనెల్లూరు, గూడూరు, కావలి, వెంకటగిరి, సూళ్ళూరు పేట, నాయుడుపేట, ఆత్మకూరు ప్రాంతాల్లో ఎక్కువగా 5శాతం నుంచి 10శాతం వరకు స్థిరాస్థి విలువను పెంచనున్నారు.

# లోక్అదాలత్‌లో 900 కేసులు పరిష్కారం

**- జిల్లా జడ్జి ఏ.వి రవీంద్రబాబు**

ఈ నెల 14న నిర్వహించిన లోక్అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 900 కేసులు పరిష్కారమయ్యాయి. నెల్లూరులో 234, గూడూరులో 143, కోవూరులో 69, కావలిలో 219, వెంకటగిరిలో 17, కోటలో 12, నాయుడుపేటలో 25, సూళ్ళూరుపేటలో 88, ఆత్మకూరులో 89, ఉదయగిరిలో 26 కేసులు పరిష్కారమయ్యాయి. అన్ని కేసులను న్యాయమూర్తులు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయడంతో లోక్అదాలత్ కార్యక్రమం జయప్రదమైంది. ఈ సందర్భంగా జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాసదన్ భవన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ ఏ.వి రవీంద్రబాబు మాట్లాడుతూ లోక్అదాలత్ వల్ల అటు కాలం, ఇటు డబ్బు రెండూ ఆదా అవుతాయని, సుహృద్భావ వాతావరణంలో కేసులను రాజీ చేసుకుంటే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు బి.శ్రీనివాసరావు, మహ్మద్ అబ్దుల్ రఫీ, గొల్ల శ్రీదేవి, సునీత, హెచ్ చంద్రశేఖర్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ పి.జె సుధ, బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.ఫణిరత్నం, రామిరెడ్డి రోజారెడ్డి, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. 5 ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటుచేసి కేసులు పరిష్కరించారు. ప్రిసైడింగ్ అధికారులుగా 1వ అదనపు జిల్లా జడ్జి బి.శ్రీనివాసరావు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ పి.జె సుధ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.వి సుబ్బారావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కెసిహెచ్ శ్రీనివాస్, మొదటి తరతి స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ షేక్ అతిఖ్ అహ్మద్, మొదటితరగతి నాల్గవ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కె.మురళీమోహన్ వ్యవహరించగా, వారికి సహాయక మెంబర్లుగా న్యాయవాదులు కె.శిఖివాహన్, బి.రమేష్, పి.సి కృష్ణయ్య, టి.శ్రీనివాసరావు, పి.వి ప్రసాదరావు, ఎం.శేఖర్ వ్యవహరించారు. అన్ని కేసులకు కలిపి 7,85,06,877రూపాయల నగదు చెల్లించేలా వివాదాలను న్యాయమూర్తులు పరిష్కరించి బాధితులకు చెక్కులు అందజేశారు.

# వెంకటాచలసత్రం ఎస్ఐ సస్పెండ్

అవినీతి ఆరోపణల నేపథ్యంలో వెంకటాచలసత్రం ఎస్ఐ నాగరాజును సస్పెండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఉత్తర్వులు జారీచేశారు. నాగరాజు వెంకటాచలం ఎస్ఐగా నాలుగు నెలల క్రితం బాధ్యతలు చేపట్టినప్పటినుంచి అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిపై అక్రమరవాణా దారులకు, మండలంలో కోడిపందేలు, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు సహకరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో, ఆ ఆరోపణలను విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఎస్పీ నెల్లూరు రూరల్ డిఎస్పీ కె.రాఘవరెడ్డిని ఆదేశించారు. ఆరోపణలు వాస్తవాలను తేలడంతో నివేదికను ఎస్పీకి అందజేశారు. దీంతో, నాగరాజును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు.

# ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారికి ఈ నెల 15న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు అభిషేకాలు చేసి, విశేష పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పొంగళ్ళు పొంగించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సంతానం కోసం వరపడిన మహిళలు ఆలయంలోని త్రిశూలం వద్ద పూజలు చేసుకుని, రావిచెట్టుకు ఊయలలు కట్టారు. ఆలయ ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పేర్నాటి ఆనందరెడ్డి తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# దండిగుంట హెచ్ఎంకు టాలెంట్ ఐకాన్ అవార్డు

విడవలూరు మండలంలోని దండిగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.శ్రీశైలకు టాలెంట్ ఐకాన్ అవార్డు లభించింది. విద్యాబోధన విషయంలో విశేష ప్రతిభ చూపినందుకుగాను హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఈనెల 15న జరిగిన కళాఉత్సవ్ కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. అవార్డుతో పాటు టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్సు కూడా ప్రదానం చేశారు. వే ఫౌండేషన్, తెలుగు కళావేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించింది.

# అష్టకష్టాలు పడుతున్న ఆక్వారైతు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

గిట్టుబాటు ధర లేక, పెరిగిన కరెంటు చార్జీలతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతో ఆక్వారంగం కుదేల్ అవుతున్నదని వైయస్సార్ సిపి జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 17న నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కరెంట్ చార్జీలు మోత మోగిస్తుండడంతో ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. దీంతో ఆక్వా రైతులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆక్వా రైతులకు చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రూ2 లకే యూనిట్ కరెంట్ ఇస్తామని చెప్పి రెండు నెలలు అవుతున్నా ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. గత ఏడాది తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు మూడు నెలల రాయితీతో కరెంట్ ఇస్తామన్న హామీని తుంగలో తొక్కారన్నారు. అన్ని విధాల ఆక్వా రైతులపై పక్షపాత ధోరణితో అవలంభిస్తున్నారని తెలిపారు. ప్రధానంగా నకిలీ సీడ్స్, ఫీడ్ తయారు చేసేవారికి అధికార పార్టీ అండ వుండడంతో రైతులు నష్టం చవిచూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఏసీడీ కట్టలేని రైతుల వద్ద కరెంటు చార్జీలు కట్టించుకోమని చెప్పడం దారుణంగా ఉందన్నారు. ఈ విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడంతో దారికి వచ్చారన్నారు. ప్రధానంగా మద్దతు ధర లేకపోవడంతో రొయ్యలను కిలో రూ. 170కే తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో ఎకరాకు రూ. 1.50 లక్షలు నష్టం రైతులకు వస్తోందన్నారు.

## వైయస్సార్‌సిపి అధికారంలోకి వస్తే రూ.1.50కే కరెంటు

ఆక్వా రైతుల కష్టాలను తెలుసుకుని వారికి న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు రూ.1.50 లకే యూనిట్ కరెంట్ సరఫరా చేస్తామని ఇటీవల వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం జరిగిందని కాకాణి గుర్తు చేసారు. అదేవిధంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఆక్వా రైతులకు నష్టం లేకుండా చూడాలని కూడా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్ సిపి నాయకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తిదారులకు శుభవార్త

- **విజయా డెయిరీలో పాల కొనుగోలు ధరలు పెంపు**
- **ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి వెల్లడి**

విజయా డెయిరీకి పాలు విక్రయించే రైతులకు ఆ సంస్థ పాలకవర్గం శుభవార్త అందించింది. లీటరు పాలపై రూపాయి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 16 నుంచి ఈ కొత్తధర అందుబాటులోకి వస్తుందని ఈనెల 14న ఆ సంస్థ కార్యాలయంలో డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తెలియజేశారు.

పాడి రైతుల పెట్టుబడి ఖర్చులను దృష్టిలో పెట్టుకుని, వారికి వెసులుబాటు కలిగిస్తూ ఆ మేరకు ధర పెంచామని ఆయన పేర్కొన్నారు. ఈనెల 16వ తేది నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయన్నారు. ప్రస్తుతం గేదెపాలపై రూ. 52.90 చెల్లిస్తుండగా, కొత్త ధర ప్రకారం రూ. 53.90 చెల్లిస్తామన్నారు. 10శాతం వెన్నతో ఉన్న పాలకు మాత్రమే ఈ ధర వర్తిస్తుందన్నారు. 5 శాతం వెన్న వుంటే రూ.26.95, 6 శాతం ఉంటే 32.34, 7 శాతానికి రూ.37.73, 8శాతానికి రూ.43.12, 9శాతానికి రూ.48,51 వంతున చెల్లించనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో 140 సహకార సొసైటీలతో పాటు 400 నాన్‌సొసైటీల ద్వారా రోజుకు విజయాడెయిరీ 22వేల లీటర్ల పాలను సేకరిస్తోందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆవుపాల ధరలను కూడా పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. 4.5శాతం వెన్న ఉన్న లీటరు పాల ధర ఇప్పటిదాకా రూ.27.89 ఉండగా, ఇకనుంచీ రూ.28.54 చెల్లించేవిధంగా ఉత్తర్వులిచ్చామన్నారు. ఈ విషయాలను పాల ఉత్పత్తిదారులు గమనించి డెయిరీకి సహకరించాలని ఆయన కోరారు.

# రిజర్వేషన్లను తుంగలో తొక్కిన టిడిపి

**- యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుని ధ్వజం**

బీసీల ఓటుబ్యాంకుతో అధికారంలోకి వచ్చినట్లు చెప్పుకునే టిడిపి ప్రభుత్వం మెడికల్ కౌన్సిలింగ్‌లో ఎస్సీఎస్టీ, బిసి విద్యార్థులకు తీరని ద్రోహం చేసిందని, ఆయావర్గాల వారికి రిజర్వేషన్లను తుంగలో తొక్కిందని యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణయాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. నెల్లూరులోని పప్పులవీధిలో వున్న యాదవ మహాసభ కార్యాలయంలో ఈనెల 15న నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎంబిబిఎస్ కౌన్సిలింగ్ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఓపెన్ క్యాటగిరిలో ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులందరినీ రిజర్వేషన్ కేటగిరీలో భర్తీ చేశారని, ఇందువల్ల రిజర్వ్‌డ్ అభ్యర్థులు 496మంది సీట్లు కోల్పోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ అమలులో విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని రాజకీయాలకు అతీతంగా అందరూ ఖండించాలన్నారు. ఈ సమావేశంలో అఖిలభారతీయ యాదవ మహాసభ నాయకులు ఒట్టూరు సురేంద్రయాదవ్, వేమూరు వేణుయాదవ్, రాసాల వెంకటసుబ్బయ్య మోరా కామేశ్వరరావు, నల్లజర్ల శీనయ్య పాల్గొన్నారు.

# బాబు పాలనకు చరమగీతం పాడుతాం

**- ఎమ్మెల్యే కిలివేటి**

అబద్దాలతో నాలుగేళ్ళు నెట్టిన సిఎం చంద్రబాబును ప్రజలు గమనించి ఆయన పాలనకు చరమగీతం పాడేందుకు రోజులు లెక్కిస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఈనెల 17న నెల్లూరు జిల్లా తడ మండలంలోని ఇరకం, పూడికుప్పానికి చెందిన మత్స్యకారులు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుంచి వైయస్సార్‌సిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ అబద్దాలతోనే కాలం వెళ్ళతీయడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతో పనులుచేసి వాటికి చంద్రన్న బాటంటూ పేరు పెట్టుకోవడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ సమయంలో మాత్రమే పులికాట్ అభివృద్ధిపై ప్రకటనలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు బాలచంద్రారెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, కె.ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

# అసత్యప్రచారంపై కఠిన చర్యలు



విలేకర్లతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ

సోషల్ మీడియాలో జిల్లా కలెక్టర్‌పై అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ హెచ్చరించారు. 18వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అసత్య ప్రచారాలను పోస్ట్ చేసిన వారి మీదే కాకుండా షేర్ చేసిన వారిపై కూడా కేసులు పెడతామన్నారు. కలెక్టర్‌పై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషప్రచారంపై కలెక్టర్ ఏ.ఓ మధుసూదనశర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈనెల 12వతేదీ నుండి వాట్సాప్, ఫేస్‌బుక్ లలో కలెక్టర్‌పై తప్పుడు వార్తలు పెడుతూ కులవిద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని, ఎంతటి వాళ్ళయినా ఇలాంటి వాళ్ళను ఊపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. కలెక్టర్‌పై అసత్య పోస్టింగ్‌లు పెట్టడంలో బయట వ్యక్తుల పాత్ర వుందా లేక కార్యాలయ సిబ్బంది హస్తముందా అన్నదానిపై కూడా విచారణ జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.



# నాయకుడికి కార్యకర్తలే ప్రాణం

## - నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ఏ పార్టీకైనా, ఏ నాయకుడికైనా కార్యకర్తలు ప్రాణం లాంటి వారని, పటిష్టమైన కార్యకర్తల బలం లేకుంటే ఆ పార్టీలు, ఆ నాయకుడు పునాదులు లేని భవనాలు లాగా కుంగిపోతారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల17న రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం 23వ డివిజన్ వైయస్సార్ సిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం, రక్షణ కోసం రూరల్ నియోజకవర్గంలో వైయస్సార్ సిపి పక్షాన అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో ఇన్సూరెన్స్ పథకం అతిముఖ్యమైందన్నారు. రూరల్ నియోజకవర్గంలో ప్రతి పది ఇళ్ళకు ఒక కార్యకర్త ఉండే విధంగా ప్రయత్నాలు ప్రారంభించామని, రాబోయే రెండు నెలలు కార్యకర్తల శిక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. కష్టకాలంలో జెండా మోసిన ప్రతి కార్యకర్తని ఎప్పటికి మర్చిపోనని, ప్రతి కార్యకర్త రుణం తీర్చుకుంటానన్నారు.

# దేదీప్యమానంగా కోటికుంకుమార్చన



కోటికుంకుమార్చనలో పాల్గొన్న ఆల్తూరు గిరీష్‌రెడ్డి మరియు కుటుంబసభ్యులు

బుచ్చిమండలం జొన్నవాడలోని మల్లిఖార్జునస్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలోఈ నెల 13వ తేదీ నుండి అమ్మవారికి కోటి కుంకుమార్చన మహోత్సవం ప్రారంభమైంది. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయంద్రసరస్వతి ఆశీస్సులతో జరుగుతున్న ఈ కుంకుమార్చన ఈ నెల 23వ తేదీ వరకు జరుగనుంది. 13వ తేదీన ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. 14వ తేదీ వల్లూరు రవీంద్రరెడ్డి – పెద్దకామాక్షమ్మలు ఉభయకర్తలుగా పూజలు నిర్వహించారు. 15వ తేదీన ధర్మకర్తగా వ్యవహరించిన పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ



కామాక్షమ్మ సన్నిధిలో పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు

సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సతీమణి ప్రశాంతితో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మండపంలో ఏర్పాటుచేసిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలను విశేష పుష్పాలతో, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు విచ్చేసిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులను ఆలయ పాలకమండలి ఛైర్మెన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం తదితరులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి ఆలయంలో కోటికుంకుమార్చన పూజలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులందరికీ అభినందనలు తెలిపారు. అలాగే 16వ తేదీ చిట్టమూరు వెంకటరెడ్డి – సుగుణమ్మ దంపతులు, బుర్లా దామోదరరెడ్డి కుటుంబసభ్యులు, 17వ తేదీ వంగల్లు శ్రీనివాసులురెడ్డి–నీరజ, 18వ తేదీ పార్లపల్లి రఘురామిరెడ్డి – సుజాతమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ పూజలలో ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కూడా పాల్గొన్నారు. ఆలయంలో ప్రతిరోజూ ఉదయం గోపూజ, లక్ష్మీగణపతిపూజ, కలశస్థాపన, దీక్షధారణ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేశారు. శ్రీచక్ర నవావరణ పూజ నిర్వహించారు. ఉదయం కోటికుంకుమార్చన, మధ్యాహ్నం క్షీరతర్పణం, మంగళహారతి, మంత్రపుష్పం పూజలు జరిగాయి. దాదాపు 70 మంది రుత్విక్కులతో వేదమంత్రాల మధ్య కోటికుంకుమార్చన పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలలితా సహస్రనామార్చన ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యనాయుడు, ఇ.ఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## బాపిరెడ్డికి డ్వామా బాధ్యత



జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా టి.బాపిరెడ్డిని నియమించారు. ఆత్మకూరు ఆర్డీవోగా వున్న ఆయనను పదోన్నతిపై ఈ పోస్ట్‌లో పెట్టారు. చిత్తూరు జిల్లా కెఆర్ఆర్‌సిలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జి.సువర్ణమ్మను ఆత్మకూరు ఆర్డీవోగా నియమించారు.

**టిజిపి స్పెషల్ కలెక్టర్‌గా భార్గవి:** తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్‌గా ఎస్.భార్గవిని ప్రభుత్వం నియమించింది. గతంలో ఇక్కడ స్పెషల్ కలెక్టర్‌గా వున్న ప్రశాంతి అనంతపురం జిల్లాకు బదిలీ కావడం తెలిసిందే!

# తోళ్ళ పరిశ్రమ అంటే.. తోలు వలుస్తాం..

## - ఉద్యమ కమిటీ సభ్యుల స్పష్టీకరణ



కోట మండలంలోని తీరప్రాంతంలో ఉన్న కొత్తపట్నం సెజ్‌లో తోళ్ళపరిశ్రమ ప్రతిపాదనలు వద్దనే వద్దని, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లజేసే ఆ పరిశ్రమను తాము వ్యతిరేకిస్తున్నామని పరిశ్రమ వ్యతిరేక ఉద్యమ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈనెల 18న కమిటీ ఛైర్మెన్, మైపాస్ ర్సీపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో పలుపార్టీల నేతలు సమావేశం నిర్వహించి పరిశ్రమ విషయంపై చర్చించారు. ప్రభుత్వం మొండివైఖరితో పరిశ్రమ స్థాపనకు సమాయత్తమైతే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని వారు హెచ్చరించారు. ఈ తోళ్ళ శుద్ధి పరిశ్రమ కాకుండా, మరేదైనా ఇతర పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేందుకు ఇబ్బంది లేదన్నారు. ఇక్కడ ఆ పరిశ్రమ కోసం 538ఎకరాలను సిద్ధంచేసి ఉంచారని, బూట్ల పరిశ్రమ ఏర్పాటుకు లిడ్‌క్యాప్ ముందుకు వచ్చిందని అన్నారు. అయితే, ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన ప్రకటనలో స్పష్టత లేదన్నారు. బూట్ల పరిశ్రమ పేరుతో తోళ్ళ శుద్ధి పరిశ్రమను ఏర్పాటుచేస్తారన్న ప్రచారం జరుగుతుండడంతో ప్రజల్లో ఆందోళన నెలకొందని ఆయన అన్నారు. బిజేపీ జిల్లా కన్వీనర్ మీజూరు మాధవ్ మాట్లాడుతూ, 40 గ్రామాల ప్రజలు తోళ్ళపరిశ్రమను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వ్యవహారం అనుమానాస్పదంగా ఉందని, ప్రజాభీష్టం మేరకే ఎమ్మెల్యే నడచుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిద్ధవరం ఎంపిటిసి సురేంద్ర, జడ్పీటిసి సభ్యుడు ఉప్పల ప్రసాద్‌గౌడ్, కమిటీ నాయకులు దువ్వూరు సాయికృష్ణారెడ్డి, పొదర్తి రాధాకృష్ణారెడ్డి, మధురెడ్డి, ఇన్నమాల వెంకటాద్రి, బాలయ్య, జనార్ధన్‌రెడ్డి, ఉప్పల మణి తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రభా'తం

# పైశాచికత్వానికి పరాకాష్ట

**మనదేశంలో చట్టాలు ఎంత కట్టుదిట్టంగా ఉన్నా.. నేరస్తులు.. కామాంధులు మాత్రం పెట్రేగిపోతూనే ఉన్నారు. అబలలను, అసహాయులను తమ క్రూరత్వానికి బలితీసుకుంటూనే ఉన్నారు. చెన్నైలోని ఒక అపార్ట్‌మెంట్‌లో అసహాయురాలైన ఓ పదకొండేళ్ళ బాలికపై 24 మంది మగపిశాచాలు అత్యంతఘోరంగా అత్యాచారం జరపడం సభ్యప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. పైశాచికత్వానికి పరాకాష్టగా నిలిచిన ఇలాంటి ఘటనల్లోని నిందితులకు ఎంత కఠినాతి కఠినశిక్ష విధించినా పాపం లేదు.**

మన దేశంలో చట్టాలు ఎంత కట్టుదిట్టంగా ఉన్నా, పోలీసు-న్యాయవ్యవస్థలు ఎంత పటిష్టంగా ఉన్నా.. మరోవైపు నేరస్తులు.. కామాంధులు మాత్రం పెట్రేగిపోతూనే ఉన్నారు. నేరస్తులకు ఎంత కఠిన శిక్షలు వేస్తున్నా..మరింతమంది రాక్షసులు పుట్టుకొస్తూనే ఉన్నారు. కనీసం మానవత్వం కానీ, జాలీ-దయ అన్నది కానీ కలికానికి కూడా కనిపించని పైశాచిక ప్రవృత్తితో అమాయకులను తమ క్రూరత్వాలకి బలితీసుకుంటూనే ఉన్నారు. చెన్నైలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఇటీవల జరిగిన దారుణం సభ్యప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. మనుషులన్న ప్రతివారినీ కన్నీరు పెట్టించింది. జంతువులకున్న కనీస జాలి.. దయ కూడా లేని కొంతమంది మగపిశాచులు అభం శుభం తెలియని ఓ పదకొండేళ్ళ దివ్యాంగురాలిపై నెలలతరబడి అఘాయిత్యం చేస్తూ తమ పైశాచికత్వాన్ని కొనసాగించారు.

ఎట్టకేలకు పోలీసులు రంగంలోకి దిగడంతో వారి ఆట కట్టింది. పోలీసులు అక్కడి మీడియాకు తెలిపిన వివరాల మేరకు... చెన్నైలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నెలల తరబడి ఈ అకృత్యం కొనసాగింది. ఆ అపార్ట్ మెంట్‌లో నివాసం ఉంటున్న ఆ బాలిక స్కూల్‌కు వెళ్ళేందుకు రోజూ లిఫ్ట్‌లో వచ్చి వెళ్తుండేది. వినికిడి సమస్య ఉన్న ఆ బాలిక అసహాయతను లిఫ్ట్ ఆపరేటర్‌గా ఉన్న ఓ 66 ఏళ్ళ వృద్ధ కామపిశాచి అవకాశంగా మలుచుకున్నాడు. ఆ చిన్నారికి లేనిపోని మాయమాటలు చెప్పి లోబర్చుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ విషయాన్ని అపార్ట్ మెంట్‌లో ఇతర సిబ్బందికి కూడా చెప్పాడు. అంతే, ఇక అందరూ కూడబలుక్కుని, అక్కడున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులతో సహా అందరూ కలసి ఆ బాలికపై అకృత్యానికి పథకం వేసుకున్నారు. బాలికను ఓ గదిలోకి బలవంతంగా తీసుకెళ్ళి మత్తు ఇంజక్షన్లు ఇచ్చి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ దృశ్యాలన్నీ వారు వీడియో తీసి ఆ బాలికకు చూపించి తమ మాట వినకపోతే ఆ వీడియోలను అందరికీ చూపుతామని బెదిరించడం, ఆ తర్వాత శీతలపానీయాల్లో మత్తుమందు కలిపి ఇచ్చి అత్యాచారం చేయడం వంటి అఘాయిత్యాలకు నిందితులు పాల్పడ్డారని పోలీసులు పేర్కొన్నారు. చివరికి ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు కూడా ఈ కామపిశాచాలతో చేరిపోయి, వారు కూడా ఆ బాలికను తమ పశుప్రవృత్తితో చిదిమేశారు. ఆ బాలిక సోదరి వచ్చి పరిస్థితి తెలుసుకుని తల్లిదండ్రులకు చెప్పడం.. పోలీసులు రంగంలోకి దిగి ఆ కామపిశాచాలను అరెస్ట్ చేయడంతో ఈ దారుణం ఇప్పటికి వెలుగులోకి వచ్చింది. ఈ ఘోరమైన దుర్ఘటన చెన్నైను కలచివేసింది. సభ్య సమాజాన్ని కంటతడిపెట్టించింది. అక్కడున్న ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల నుంచి ప్లంబర్ల వరకు, చివరికి ఎలక్ట్రీషియన్ దాకా, ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న 22మంది నరరూప కామపిశాచాలు నిత్యం ఆ బాలికపై ఎగబడడం, తమ పశుప్రవృత్తిని తీర్చుకోవడం... ఏడు నెలలుగా సాగిన పైశాచికక్రీడతో ఆ బాలికను హింసించడం చూస్తే మానవత్వం అన్నది మంటకలిసిపోయిందంటూ అక్కడున్న ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూల్‌డ్రింక్స్‌లో మత్తుమందు కలిపి అరవకుండా చేయడం, ఆ బాలిక నగ్నచిత్రాలను, వీడియోలు తీయడం..ఆ విషయం ఎవరికైనా చెప్తే వాటిని బయటపెడతామని బెదిరించడం, లేదంటే చంపుతామని భయపెట్టడం వంటి ఘాతుకాలతో ఆ మగమృగాలు తమ అకృత్యాన్ని ఏడునెలల పాటు కొనసాగించాయంటే వారు అసలు మనుషులేనా?... ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సిబ్బందే అమాయక బాలికపై ఇంతటి ఘోరమైన అకృత్యానికి పాల్పడ్డారంటే ఏమనుకోవాలి?... ప్రైవేట్ సెక్యూరిటీ పేరుతో అక్కడ పనిచేస్తున్న మరిన్ని మృగాలు కూడా ఈ అకృత్యాలకు పాల్పడ్డాయంటే.. ఇక ఎవరిని నమ్మాలి?.. ఆ బాలికకు మత్తు ఇంజెక్షన్లు ఇవ్వడం, శీతల పానీయాల్లో మత్తుపదార్థాలు కలిపి ఇవ్వడం, పొడిరూపంలో ఉన్న మాదక ద్రవ్యాలను ముక్కుతో పీల్చేలా చేసి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారని.. ఆ పిశాచుల పైశాచిక ప్రవృత్తిని అక్కడి పోలీసులు వెల్లడించారు. బాలికపై దారుణానికి పాల్పడుతూ వీడియోలు కూడా తీశారని, లిఫ్ట్ ఆపరేటర్ మొదటుగా ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడగా, ఆ తర్వాత పలువురు అతనితో జతకట్టి ఏడు నెలలపాటు ఆ బాలికను లైంగికవేధింపులకు, హింసకు గురిచేశారని పోలీసులు పేర్కొంటున్నారు. ఆ కామాంధుల అఘాయిత్యానికి ఆ బాలిక ఎంత కకావికలమైందో ఊహించుకుంటేనే ఎవరికైనా వళ్ళు గగుర్పొడుస్తుంది. ఈ సంఘటన విని సభ్యసమాజం చలించిపోయింది. ఈ కామపిశాచుల్ని కఠినంగా శిక్షించాలంటూ ఘోషిస్తోంది.

కాగా, తమ బిడ్డపై జరిగిన పాశవికత్వాన్ని తలచుకుంటూ బాలిక తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ సొమ్మసిల్లిపోతున్నారు. గుండెలవిసేలా కంటికి మింటికీ ఏకధారగా రోదిస్తున్నారు. వారి వేదన ఎవరు తీర్చగలరు?..పిశాచాలకన్నా హేయంగా ప్రవర్తించిన ఆ మృగాల్లో 18 మందిని ఇప్పటికే పోలీసులు పట్టుకున్నారు. మిగిలిన నలుగురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల్ని పోలీసులు కోర్టుకు తీసుకువచ్చినప్పుడు అక్కడున్న న్యాయవాదులు కూడా నిందితుల పట్ల కోపోద్రిక్తులై దాడికి దిగారంటే సభ్యసమాజం ఎంతగా ఈ ఘటన పట్ల మండిపడుతోందో తెలుస్తుంది. లాయర్లు ఎవరూ ఆ కామపిశాచాల తరపున వాదించకూడదని లాయర్ల సంఘం తీర్మానించుకుంది. నిందితుల్లో యువకుల నుంచి వృద్ధుడి వరకు మొత్తం 24 మంది ఉన్నారని, వారిలో 18 మందిని అరెస్ట్ చేశామని, మిగిలినవారి కోసం గాలిస్తున్నామని, అపార్ట్‌మెంట్‌లోని సిసి ఫుటేజీల ద్వారా పూర్తి సమాచారం కోసం ఆరాతీస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ఆ 18 మంది నిందితులకు మహిళా కోర్టు ఈ నెల 31 దాకా రిమాండ్ విధించింది.

ఏదేమైనా.. పైశాచికత్వానికి పరాకాష్టగా నిలిచిన ఈ ఘటనలోని నిందితులను ఎంత త్వరగా శిక్షిస్తే సమాజానికి అంత మంచిది. ఆ శిక్ష కూడా ఇక ఇలాంటి ఘటనలు దేశంలో ఇక ఎక్కడా పునరావృతం కాకుండా ఉండేలా.. మరింత కఠినంగా.. కఠినాతి కఠినంగా ఉంటే తప్ప ఇలాంటి ఘోరాలు.. దారుణాలు ఆగవు.

# నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు సాగాలి..



ప్రతిభా విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న సంఘ సభ్యులు

నాయీ బ్రాహ్మణులు ఏకతాటిపై నిలిచి ఐక్యంగా ముందుకు సాగాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పివి రమణయ్య పిలుపునిచ్చారు. ఈనెల 15న నెల్లూరులోని శ్రీమద్దులూరు వీర రాఘవయ్య నాయీ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్రం అంతటా స్పందన వస్తోందని, ఇంకా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ప్లీడర్ పోట్లూరు శ్రీనివాసులు మాట్లాడుతూ సంఘ సేవా కార్యక్రమాలకు ఏటా సహాయ, సహకారాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనకరావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల్లో వివిధ సంఘాలు ఉన్నాయని, ఇవన్నీ కలిసికట్టుగా పనిచేస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో వేలూరు రంగారావు, వినుకొండ వెంకటేశ్వర్లు, బాలకేశవులు, కెవి సుబ్బారావు, హజరత్తయ్య, వివిధ జిల్లాల నుంచి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఆగస్టు సరుకుల కోటా వచ్చేసింది

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ప్రజాపంపిణీ వ్యవస్థ కిందఈ ఏడాది ఆగస్టు నెలకు సంబంధించిన బియ్యం, చక్కెర, కందిపప్పు, గోధుమపిండి తదితర వస్తువుల కేటాయింపులు చేశారని, జిల్లాలోని అందరు చౌకడిపో డీలర్లు ఆగస్టు మాసానికి సంబంధించి, వారికి పూర్తిగా కేటాయించిన దానిలో 90శాతం కోటాకు బ్యాంకులో జమచేసి, మండల స్థాయి గోదాము నుండి సరుకులను దగ్గరుండి తీసుకువెళ్ళాలని పౌరసరఫరాల సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. చౌకడిపో డీలర్లందరూ ఈ నెల 15వ తేది నుంచి వారి కేటాయింపుకు సంబంధించిన మొత్తాన్ని బ్యాంకులో జమచేసి 90శాతం సరుకులను నెలాఖరులోగా పూర్తిగా తీసుకుని ఆగస్టు 1 నుంచి పంపిణీ చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

# నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నెల్లూరుజిల్లా శాఖకు ఇటీవల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్ సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా పి.కరీముల్లాఖాన్, కోశాధికారిగా కె.రాజేష్, కార్యనిర్వాహణ కార్యదర్శిగా పి.నాగేంద్రరావు, మహిళా ప్రతినిధిగా డి.సుమతిలతో పాటు, పలువురు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.




## అది కాంగ్రెస్ ముస్లిం లీగ్

కాంగ్రెస్‌పార్టీని ముస్లింల పార్టీగా అభివర్ణించాడు రాహుల్ గాంధీ. ఆయన చెప్పింది అక్షరాలా నిజమే! భారతీయ వారసత్వ పరంగా చూస్తే రాహుల్‌గాంధీ కూడా ముస్లిమే! ఫిరోజ్‌ఖాన్ కొడుకు రాజీవ్. ఈ దేశంలో తండ్రి వారసత్వం, ఇంటి పేరే కొడుకుకు వర్తిస్తుంది. ఆ లెక్కల్లో చూస్తే రాజీవ్, ఆయన కొడుకు రాహుల్‌లు ముస్లింలే! కాబట్టి ఆయన కాంగ్రెస్‌ను ముస్లింల పార్టీ అనడంలో తప్పులేదు. ఆయన కొంచెం ఆలోచించి స్వాతంత్రోద్యమ కాలం నాటి కాంగ్రెస్ పేరుకు బదులుగా ఆలిండియా కాంగ్రెస్ ముస్లిం లీగ్ పార్టీ అని ఆ పార్టీ పేరు మారిస్తే బాగుంటుందేమో! మజ్లిస్-ముస్లింలీగ్ వంటి పార్టీలకు కాంగ్రెస్‌పార్టీ ఏమీ తీసిపోదని మన రాహుల్‌గాంధీ నిరూపించాడు.

– సి.రాజీవి, నెల్లూరు.

## మాయలమరాఠీ చంద్రబాబు

మన రాష్ట్రంలో రెండు బలమైన పార్టీలు అధికారం కోసం పోటీ పడుతున్నాయి. వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి భోళాశంకరుడు. జనాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బవుతాడు. టీడీపీ అధినేత చంద్రబాబు టక్కుటమార గోకర్ణ విద్యలందు ఆరితేరినవాడు. ప్రభుత్వం, పోలీసు ఆయన చేతిలో వున్నాయి. కుయుక్తులతో అబద్దాలను అవలీలగా నిజం చేయగలడు. మోడీనే దించాలనే దుష్టాలోచనగలవాడు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## ప్రజలను సోంబేరులను చేస్తున్నారా?

ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఆసరాగా ఉండడం తప్పు కాదు. కాని, సోంబేరులను చేయకూడదు. వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు ఇచ్చారంటే అర్థముంది. ఇప్పటికి కూడా కిలో బియ్యం ఒక రూపాయి ఏంటి? దీనికంటే కూడా దిక్కుమాలిన పథకం 'అన్న క్యాంటీన్'లు. తమిళనాడులో 'అమ్మ క్యాంటీన్'లు చూసి మనవాళ్ళు వాతలు పెట్టుకుంటున్నారు. ఐదు రూపాయలకే టిఫిన్, భోజనం అంటున్నారు. మళ్ళీ ఈ క్యాంటీన్‌ల వద్ద అన్నదానం చేస్తున్నట్లు తోపులాటలు. మనుషులను ఈ ప్రభుత్వాలు ఎక్కడికి తీసుకుపోతున్నాయి? పనీపాటా లేకుండా సోంబేరులుగా మారుస్తున్నాయా? వాళ్ళను కేవలం ఓట్ల యంత్రాలుగా చూస్తున్నాయా? ఏ మనిషి కూడా ఖాళీగా లేకుండా ఏదో ఒక పని చేస్తూ వుండడమే నిజమైన అభివృద్ధి. ఇలా అన్న క్యాంటీన్‌లు పెడితే దేశంలో అడుక్కుతినేవాళ్ళు ఎక్కువవుతారు. సాయంత్రానికి పాతికరూపాయలొచ్చినా మాడుపూటలా జరిగిపోతుందిగా!

– ఎస్.సజీవ్, తిరుపతి.

# నాయకుడితో నడిచిన పేర్నాటి



తూర్పుగోదావరిజిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపాడులో జరుగుతున్న ప్రజాసంకల్పయాత్రలో వైఎస్సార్సీపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఈ నెల 15న కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో జిల్లా తాజా రాజకీయాలపై ఆయన చర్చించినట్లు సమాచారం. జగన్‌ను కలిసిన వారిలో కృష్ణారెడ్డి సునీల్‌రెడ్డి, పాదర్తి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, పాలగాటి సాయికృష్ణారెడ్డి ఉన్నారు.



# జయకు లైన్ క్లియర్ అయినట్లే?

## • ఇంకా తేలని ఆత్మకూరు



జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి అసలే బాగోలేదు. దీనికితోడు వర్గ విభేదాలొకటి! నాయకులంతా సమైక్యంగా కలిస్తేనే జిల్లాలో పార్టీ పటిష్టత అంతంత మాత్రంగా ఉంటుంది. ఇక ఎవరికి వాళ్ళు తన్నుకుంటుంటే ఇంకా ఘోరంగా వుంటుంది.

జిల్లా తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు రెండు పదవులు వర్గ రాజకీయాలకు కేంద్రంగా మారాయి. ఇందులో ఒకటి నెల్లూరు నగర అధ్యక్ష పదవి. ప్రస్తుతం అధ్యక్షుడిగా వున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థకు అధ్యక్షుడు కావడం తెలిసిందే! జోడు పదవుల కారణంగా నగర అధ్యక్షుడిగా ఆయన స్థానంలో మరొకరిని పెట్టాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా వున్న ఆనం జయకుమార్‌రెడ్డి పేరు వినిపిస్తూ వచ్చింది. ఆనం జయకైతే పోటీ లేకుండా ఇవ్వొచ్చనుకున్నారు. అయితే పార్టీలో ఆదాలతో పాటు ఆనంను కూడా వ్యతిరేకించే ఒక వర్గం హఠాత్తుగా బీసీ కార్డును తెరమీదకు తెచ్చింది. ఇంతకాలం నగర అధ్యక్ష పదవిని అగ్రవర్ణాలకే ఇచ్చుకుంటూ వచ్చారని, ఇప్పుడు బీసీలకు ఇవ్వాలంటూ కొత్త నినాదాన్ని తెరమీదకు తెచ్చారు. నూనె మల్లిఖార్జున యాదవ్, ధర్మవరం సుబ్బారావు లాంటి వాళ్ళు ఈ పదవిని ఆశిస్తుండగా, వీరి వెనుక కొందరి డైరెక్షన్ వున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వివాదాలకు, నినాదాలకు తెర దించుతూ నెల్లూరు నగర టిడిపి అధ్యక్షుడిగా ఆనం జయకుమార్‌రెడ్డికి తెలుగుదేశం అధిష్ఠానం ఆమోదముద్ర వేయనున్నట్లు తెలుస్తోంది. అధికారికంగా ఆయన పేరు బయటకు రావాల్సివుంది.

ఇలాంటిదే ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కూడా! ఆనం రామనారాయణరెడ్డి ఇక పార్టీలో వుండడని తేలిపోవడంతో, ఇక్కడ కొత్త ఇన్‌ఛార్జ్ నియామకం జరగాల్సివుంది. గతంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనుచరుడు కన్నబాబు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించాడు. ఇప్పుడు మళ్ళీ ఇన్‌ఛార్జ్ కోసం ఆయనే రంగంలో వున్నాడు. ఇక అటు మంత్రి నారాయణతోనే కాక ఇటు ఆదాల ప్రభాకర్‌రెడ్డితోనూ, పార్టీలోని మిగతా నాయకులతోనూ సత్సంబంధాలు కలిగిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేరు కూడా ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా బలంగా వినిపిస్తోంది. ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా 'రెడ్డి' సామాజికవర్గం నాయకుడినే పెట్టాలనుకుంటే మెట్టుకూరుకే అవకాశం రావచ్చు. ఈయన పేరును పార్టీలో నారాయణ, ఆదాల ప్రతిపాదిస్తుండగా కన్నబాబుకు మాత్రం మంత్రి సోమిరెడ్డి ఆశీస్సులున్నట్లు తెలుస్తోంది.

నెల్లూరు నగర పార్టీ అధ్యక్ష పదవి ఎంపిక రేపోమాపో జరిగిపోతుంది. ఇక ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ ఎంపికపై చంద్రబాబు ఎవరివైపు మొగ్గుచూపుతాడో?

# కలెక్టర్‌కు ఆదాల వినతులు



మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి 17వ తేదీ నెల్లూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ముత్యాలరాజును కలిసారు. నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలో పేదలకు ఇళ్ళ స్థలాలు, గృహనిర్మాణం, సర్వే చేసి పట్టాలివ్వడం వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఆదాల సూచించిన వాటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి 15రోజుల్లోగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టీడీపీ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, ఏసునాయుడు, హరిబాబుయాదవ్, సన్నపరెడ్డి సుబ్బారెడ్డి, గంగాధర్, హరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యలో వినూత్న మార్పుకు శ్రీకారం

## • ఫలించిన బొమ్మిరెడ్డి రాఘవ పోరాటం



హైస్కూళ్లలోనే ఇంటర్ విద్యను కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తున్న జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆశయం నెరవేరనుంది. రాష్ట్రంలో వున్న మూడంచెల విద్యా విధానానికి స్వస్తి పలికి రెండంచెల విద్యావిధానాన్ని తీసుకురానున్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి ఆయా యూనివర్శిటీల వైస్‌ఛాన్సలర్‌లతో జరిగిన సమావేశంలో ప్రకటించడం జరిగింది. దీనివల్ల 6వ తరగతి నుండి ఇంటర్‌మీడియట్ వరకు ఒకే స్కూలులో చదువుకోవచ్చు. అయితే ఒకేసారి అన్ని హైస్కూళ్లలో ఇంటర్‌ను ప్రవేశపెట్టడం కష్టం కావడంతో నియోజకవర్గానికి ఒక హైస్కూల్ లెక్కన ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయనున్నారు.

**బొమ్మిరెడ్డి ఆలోచనకు కార్యరూపం**

జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఈ అంశంపై మొదటగా గళం విప్పారు. హైస్కూల్‌లోనే ఇంటర్‌ను ప్రవేశపెడితే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఏ విధంగా ప్రయోజనమో వివరిస్తూ వచ్చారు. ఇటీవల ఈ అంశంపై ఆయన నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో దీక్షకు కూడా కూర్చుని ప్రభుత్వాన్ని కదిలించేలా చేయగలిగాడు. ప్రభుత్వం ఈ విషయంపై చాలా త్వరగానే స్పందించిందనుకోవచ్చు.

**తల్లిదండ్రులకు ఊరట...**

పదో తరగతి పాసైన తర్వాత ఇంటర్ చదువుల కోసం తమ బిడ్డలను ఏ కాలేజీలో చేర్పించాలన్నది ప్రతి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ప్రశ్న! ఎంసెట్, ఐఐటి, జెఇఇ వంటి వాటిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ కార్పొరేట్ కాలేజీలవైపే మొగ్గుచూపుతున్నారు. లక్షలు పోసి చదివిస్తున్నారు. లక్షల్లో ఫీజులు కట్టి ఒక కాలేజీ నుండి వెయ్యిమంది వ్రాసినా ర్యాంకులొచ్చేది... ఏ పాతిక, యాభై మందికో! మిగతావాళ్ళ ఫీజులన్నీ ఏటిలో వేసినట్లే! అయినా కూడా ఈ పోటీ ప్రపంచంలో చదువుల్లో తమ బిడ్డలు ఎక్కడ వెనుకబడతారోనని చెప్పి ఆస్తులమ్మయినా కార్పొరేట్ కాలేజీలలో చేరుస్తున్నారు. 6 నుండి ఇంటర్ దాకా ఒకే స్కూల్‌లో వుంటే పదో తరగతి తర్వాత కార్పొరేట్ కాలేజీలను వెదుక్కునే బాధ తప్పుతుంది.

**ఓల్డ్ ఈజ్ గోల్డ్...**

50ఏళ్ళ క్రితం హైస్కూల్‌లోనే ఇంటర్ మొదటి సంవత్సరం వరకు వుండేది. 1968-69లలో ఇంటర్‌ను ప్రత్యేకంగా పెట్టారు. 50ఏళ్ళ తర్వాత పాత పద్ధతే మళ్ళీ ముద్దయ్యింది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము

నెల్లూరు, ట్రంకురోడ్డు, గాంధీనగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవాలు

తేది.27-07-2018 శుక్రవారము నుండి తేది. 05-08-2018 ఆదివారము వరకు జరుగును.

తేది. 27.7.2018 శుక్రవారము నుండి 05.8.2018 ఆదివారము వరకు ప్రతి రోజు ఉదయం 7-00గం.ల నుండి బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకములు, అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమాస్తా వద్ద 100 రూ/- చెల్లించి తగిన రసీదు పొంది పై పూజలలో పాల్గొని శ్రీ బాబా వారి తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరుతున్నాము.
తేది. 27.7.2018 శుక్రవారము నుండి 03.8.2018 శుక్రవారము వరకు ప్రతిరోజు సా॥ 6.30 నుండి సామూహిక లలితా సహస్రనామ పారాయణము, దేవీఖడ్గమాలాస్తోత్ర పారాయణ తదుపరి హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమములు జరుగును.
తేది. 03.8.2018 శుక్రవారము సాయంత్రం శ్రీ బాబావారికి పుష్పయాగము జరుగును.

నగరోత్సవం:
తేది.04-8-2018
శనివారము
సా॥6.00గం.లకు
నగరోత్సవము జరుగును.

అన్నదానం : తేది.05-08-2018 ఆదివారము మధ్యాహ్నం గం॥ 12-00లకు శ్రీ బాబా వారికి అత్యంత ప్రీతికరమైన అన్నదాన కార్యక్రమం జరుగును.

ఇట్లు: కార్యవర్గము | శ్రీ షిర్డి సాయిబాబా మందిరం | గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరుపై వరుణిడి చిన్నచూపు

రాష్ట్రంలో గుంటూరు జిల్లా నుండి శ్రీకాకుళం జిల్లా దాకా వర్షాలు పడుతున్నాయి. గోదావరి, కృష్ణా నదులతో పాటు ఈ జిల్లాల్లో వాగులు వంకలు ప్రవహిస్తున్నాయి. రాష్ట్రమంతటా వర్షాలు పడుతున్నా నెల్లూరుజిల్లాలో మాత్రం వానల ఆనవాళ్ళు లేవు. అప్పుడప్పుడు తుప్పర్లు పడడం తప్పితే జడివానలు లేవు. పెన్నానది ప్రవహించి ఎన్నేళ్ళయ్యిందో! పెన్నలో నీటి ప్రవాహం సంగతే జనం మరచిపోయారు. గట్టిగా రెండురోజులు కూడా ముసురు పట్టడం లేదు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. తాగునీటి, సాగునీటి సమస్యలు యధాతధంగా వున్నాయి. కనీసం శ్రీశైలం డ్యాం నిండితేనన్నా సోమశిలకు నీళ్ళు వదులుతారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## జగన్‌ని కలిసిన ధనుంజయరెడ్డి



నెల్లూరులోని హోటల్ డి.ఆర్. ఉత్తమ అధినేత కొడవలూరు ధనుంజయరెడ్డి 15వ తేదీన తూర్పు గోదావరి జిల్లాలో పాదయాత్రలో వున్న వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసాడు. వైసిపిలో చేరి పార్టీ గెలుపుకోసం కృషి చేస్తానని ఆయన జగన్‌కు చెప్పాడు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనుచరుడిగా 1981 నుండి కాంగ్రెస్‌లో వుంటున్న ధనుంజయరెడ్డి ఆర్టీసీ యూనియన్ లోనూ గౌరవాధ్యక్షుడిగా వున్నాడు. 2013 నుండి రెండేళ్ళ పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశాడు. 2015 జనవరిలో ఆనం సోదరులతో పాటే తెలుగుదేశంలో చేరాడు. ఇప్పుడు ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరనున్నాడనే నేపథ్యంలో ఆయన కూడా వైసిపి వైపు అడుగులు వేసాడు.

## తాగి నడిపితే జైలుకే!

మద్యం సేవించి వాహనాలు నడిపితే ఆరు నెలల జైలుశిక్ష, 3వేల జరిమానా తప్పదని ఉపరవాణాశాఖ కమిషనర్ ఎన్.శివరాంప్రసాద్ హెచ్చరించారు. నెల్లూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో దొరికిన వాళ్ళకు 16వ తేదీ ఆర్టీవో కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిటిసి శివరాంప్రసాద్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపేవారి వల్ల ఎలాంటి తప్పు చేయనివాళ్ళు, అన్నెంపున్నెం ఎరుగనివాళ్ళు ప్రమాదాల బారిన పడుతున్నారని, వారి కుటుంబసభ్యులు అనాథలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లు వాడొద్దని, ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం గత ఏడాది 10కోట్లు కేటాయించగా, ఈ ఏడాది 30కోట్లు కేటాయించారని చెప్పారు. స్పీడ్‌గన్‌లు, బ్రీతింగ్ మిషన్‌లు, క్రేన్‌లు కొనుగోలు చేసి ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## వాకింగ్ చేస్తే గుండె వ్యాధులు దూరం

నెల్లూరు విఆర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 15న వీఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుండె వ్యాధులపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లోడింగ్ డోస్ టాబ్లెట్లను పంపిణీ చేసారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటాద్రిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పక వాకింగ్ చేయడంతో గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కో-ఆర్డినేటర్ యంవి సుబ్బారెడ్డి, బయ్యా వాసు, నలుబోలు బలరామయ్యనాయుడు, గౌరవాధ్యక్షుడు డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ భాస్కర్ రావు, ఎంఎస్ రెడ్డి, శ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన చెన్నై హాస్పిటల్ ప్రివిలైజ్ కార్డును ఆవిష్కరిస్తున్న మేయర్ అబ్దుల్ అజీజ్, చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నెల్లూరు చైర్మెన్ ఎస్.వి.రమేష్

## రోడ్డా..? పెసరట్టా? హడావిడి రోడ్లంతేనయా!



కుంగిన రోడ్డు వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి




కోటంరెడ్డి ధర్నాతో హడావిడిగా రోడ్డు మరమ్మత్తులు

గత నెల 30వ తేదీన నెల్లూరులో నిర్వహించిన 'దళితతేజం - తెలుగుదేశం' సభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రావడం తెలిసిందే! సీఎం వస్తున్నాడని చెప్పి నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని మెయిన్‌రోడ్డును అప్పటికప్పుడు హడావిడిగా వేశారు. అంతకు కొన్ని రోజుల ముందే భూగర్భ డ్రైనేజ్ కోసమని ఈ రోడ్డును తవ్వి మట్టితో పూడ్చారు. దీనికి తోడు అంతకుముందే ఒక వైపు రోడ్డు గుంతలమయమైవుండింది. సీఎం వస్తున్నాడని చెప్పి యుద్ధప్రాతిపదికన ఈ రోడ్డును వెడల్పు చేయడం కోసం అంచులో మట్టి తవ్వి బ్లాక్ డస్ట్ పోసారు. అయితే కొన్నిరోజుల పాటు క్యూరింగ్ జరగాల్సి వుండగా అవేవీ లేకుండానే తారు రోడ్డు వేసేసారు. సీఎం వచ్చేరోజుకు రోడ్డు పని అయిపోయింది అనిపించారు. క్యూరింగ్ లేకపోవడంతో వాహనాల ఒత్తిడి ఎక్కువై అమిగోస్ బేకరి ప్రాంతంలో రోడ్డు కుంగింది. పైనవేసిన తారు చేత్తో తీస్తే పెసరట్టులా లేచివస్తుంది. మాగుంట లే అవుట్‌లో రోడ్డు కుంగిన విషయం తెలిసి 15వ తేదీన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అక్కడకు చేరుకున్నారు. వైసిపి కార్యకర్తలు కూడా పెద్దసంఖ్యలో వచ్చి ఆందోళన నిర్వహించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ ఇలా పనికి మాలిన రోడ్లు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## అన్న క్యాంటీన్‌లో అన్నం తిన్న తమ్ముళ్ళు



నెల్లూరు పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను 16వ తేదీ సోమవారం మున్సిపల్ మంత్రి పి.నారాయణ పరిశీలించారు. మంత్రి నారాయణ, నగర టీడీపీ ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.అనూరాధ, కమిషనర్ ఆలీంబాషాలు అక్కడే ఐదు రూపాయల అన్నాన్ని తిన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ స్టార్ హోటళ్ళకు ఏ మాత్రం తీసిపోని విధంగా అన్న క్యాంటీన్‌లను నిర్వహిస్తామని చెప్పారు. పేదవాళ్ళ ఆకలి తీర్చడమే లక్ష్యంగా చంద్రబాబు అన్నక్యాంటీన్‌లను ఏర్పాటు చేసారని, 73రూపాయలు ఖర్చయ్యే మూడుపూటలా టిఫిన్, భోజనాన్ని పేదలకు 15రూపాయలకే అందిస్తున్నామని, మిగతా 58రూపాయలు ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్నక్యాంటీన్‌లు ప్రారంభించాలనుకున్నామని, ఈ నెలలో వంద మొదలుపెడతామని, ఆగష్టు 15న మరో 103 క్యాంటీన్‌లు మొదలవుతాయని చెప్పారు.

## బులియన్ మర్చంట్స్ సేవలు అభినందనీయం



విద్యార్థినికి సైకిల్ పంపిణీ చేస్తున్న మంత్రి నారాయణ

ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఈనెల 16న నెల్లూరులోని అసోసియేషన్ కార్యాలయంలో పేద విద్యార్ధులకు నోట్ పుస్తకాలు, సైకిళ్ళు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి మంత్రి నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని అసోసియేషన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, మట్టా ప్రసన్నాంజనేయులు, శోభన్ బాబు, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సైకియాట్రిస్టుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస తేజ



ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన ప్రముఖ మానసిక వైద్యనిపుణులు పమిడి శ్రీనివాసతేజ ఎంపికయ్యారు.

ఈనెల 16న కాకినాడలో జరిగిన రాష్ట్ర మహాసభలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడంతో కొత్త మానసిక సమస్యలు పుట్టుకొస్తున్నాయన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగంతో ఉపయోగాలతో పాటు సమస్యలు అదే స్థాయిలో తలెత్తుతున్నాయన్నారు, కొత్త పోకడలతో తలెత్తే మానసిక రుగ్మతలను చాకచక్యంగా ఎదుర్కొనేందుకు వీలుగా వైద్యులకు మెళకువలు, నైపుణ్యాలు తెలియజేసేందుకు రాష్ట్ర మహాసభ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు.



- కలెక్టర్ - కాకాణిల మధ్య గొడవ తీరినట్లేనా...?
- కాకాణి మెత్తబడ్డాడా...
- కలెక్టర్ మనసు మార్చుకున్నాడా?

# వివాదం సమసినట్లేనా?

## • వైసిపి అధిష్టానం సూచనలతో దిగొచ్చిన ఎమ్మెల్యే కాకాణి

దాదాపు రెండు వారాల పాటూ సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి – జిల్లా కలెక్టర్ ముత్యాలరాజుల ఎపిసోడ్ నడవడం చూసాం. వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నాడంటూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి కలెక్టర్ ముత్యాలరాజుపై తీవ్రస్థాయిలో విమర్శల దాడి చేసాడు. కలెక్టర్‌పై కాకాణి విమర్శలు మరీ శ్రుతి మించడంతో ఉద్యోగ సంఘాలతో పాటు బీసీ సంఘాలు కూడా కాకాణికి వ్యతిరేకంగా ఆందోళనలకు దిగడం జరిగింది. కాకాణి విమర్శలపై కలెక్టర్ అయితే ఎక్కడా నోరు విప్పలేదుగాని, రెవెన్యూ సంఘాలు, బీసీ సంఘాలు కూడా కాకాణికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగడం జరిగింది.

చన్నీళ్ళకు వేనీళ్ళు సాయం అన్నట్లు తెలుగుదేశం వాళ్ళు కూడా కలెక్టర్‌కు మద్దతుగా వెంకటాచలంలో భారీ ర్యాలీ చేసారు.

అయితే కలెక్టర్ – కాకాణి వివాదం సర్వేపల్లి నియోజకవర్గం ఒక్కదానికే పరిమితమైతే ఫర్వాలేదు. ఆయన దూకుడు పెంచే కొద్దీ దాని ప్రభావం వైసిపిపై పడుతుంది.

ప్రతిపక్షంలో వుంటేనే వీళ్ళు ఉన్నతాధికారులను ఇలా దుమ్మెత్తి పోస్తున్నారు, ఇక అధికారంలోకి వస్తే ఎలా చేస్తారో అనే అనుమానాలకు బీజం వేస్తుంది. దీనికితోడు కలెక్టర్ బి.సి కావడంతో ఆ వర్గం ప్రజలపై ఎంతోకొంత ప్రభావం పడుతుంది. రాజకీయాలకు సంబంధం లేని అధికారుల పట్ల దూకుడుగా వ్యవహరించవద్దని, రాజకీయ ప్రలోభాలకు, అధికారపార్టీ ఒత్తిళ్ళకు లొంగే అధికారులను ఏమన్నాకూడా ప్రయోజనం లేదని పార్టీ అధిష్టానం చేసిన సూచనలతో కాకాణి వెనక్కి తగ్గాడని తెలుస్తోంది. అధిష్టానం సూచనతోనే ఆయన తన పోరాటం మంత్రి సోమిరెడ్డి మీదేనని కలెక్టర్ మీద కాదని సెలవిచ్చాడు.

# అభివృద్ధికి జనం జేజేలు

**- సోమిరెడ్డి**



కార్యకర్తలను వైసిపి నుండి తెదేపాలోకి ఆహ్వానిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి పనులకు జనం జేజేలు కొడుతున్నారని, ఆయన నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందగలదని నమ్మి తెలుగుదేశంపార్టీలో చేరుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు.

17వ తేదీ పొదలకూరు మండలం ముదిగేడు గ్రామానికి చెందిన 32 కుటుంబాలు వైసిపి నుండి తెలుగుదేశంలో చేరాయి. అక్కెం వెంకట్రామిరెడ్డి, యానాది రెడ్డి, కడపన వీరరాఘవరెడ్డి, మాలేపాటి శ్రీనివాసులురెడ్డి, అక్కెం శ్రీనివాసులురెడ్డి తదితరులకు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై, ఆయా గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తెలుగుదేశంలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలో చేరుతున్న ప్రతిఒక్కరినీ అన్నదమ్ముల్లాగా చూసుకుంటామన్నారు.

# కోవూరు 'దేశం'లో కొట్లాట







***జిల్లాలో తెలుగుదేశం పార్టీకి సంబంధించి కోవూరులో వున్నంతగా ఇంకే నియోజకవర్గంలోనూ వర్గరాజకీయాలు లేవు. నెల్లూరు నగర నియోజకవర్గంలో కూడా నలుగురు వర్గ నాయకులున్నప్పటికీ వీధిన పడడం లేదు. ఎవరి పనులు వాళ్ళు సైలెంట్‌గా చేసుకుంటున్నారు. కాని గత నాలుగేళ్ళుగా కోవూరు టీడీపీలో వర్గ రాజకీయాలు రచ్చకెక్కుతూనే వున్నాయి.***

మొన్నటిదాకా ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకుడు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డిల మధ్య విభేదాలు రచ్చకెక్కడం చూసాం. పోలంరెడ్డి చర్యలను పెళ్ళకూరు వర్గీయులు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్ నుండి వచ్చిన వాళ్ళకు ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీ జెండాలు మోసిన తమను పక్కనపెడుతున్నారనే అసంతృప్తి కొందరు కోవూరు తెలుగుదేశం నాయకులలో వుంది. పోలంరెడ్డి, పెళ్ళకూరుల వివాదం నడుస్తుండగానే ఇప్పుడు కోవూరు పట్టణం కేంద్రంగా కొత్త వివాదానికి తెరలేచింది. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి వర్గానికి చెందిన 15మందిని ఎమ్మెల్యే పోలంరెడ్డి బూత్ కన్వీనర్లుగా తొలగించాడు. దీంతో వాళ్ళు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. కోవూరులో పార్టీ కార్యక్రమాలు బహిష్కరిస్తామంటూ హెచ్చరించారు. ఈ విషయంలో పోలంరెడ్డికి వ్యతిరేకంగా చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డిలంతా ఒక్కటయ్యారు. వీరికి పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి వర్గం కూడా జత కలిసిందని చెప్పొచ్చు. వీళ్ళంతా ఒక్కటైతే ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా వర్గరాజకీయం రసవత్తరంగానే ఉండొచ్చు.

# నెల్లూరును సుందరంగా తీర్చిదిద్దుతాం

## - ఎన్టీఆర్ పార్కు ప్రారంభోత్సవంలో మంత్రి నారాయణ



నెల్లూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, నగరాన్ని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు సమాయత్తమవుతోందని రాష్ట్ర పురపాలకమంత్రి నారాయణ అన్నారు. నెల్లూరు 20వ డివిజన్ పరిధిలోని అనిల్ గార్డెన్స్ వద్ద 1.10 కోట్లతో నిర్మించిన ఎన్టీఆర్ పార్కును ఆయన ఈనెల 15న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో 21 పార్కులను అభివృద్ధి చేశామన్నారు. పార్కుల సుందరీకరణకు 51 కోట్లు వెచ్చించామన్నారు. ప్రతి పార్కులో ఓపెన్ జిమ్, పిల్లలకు ఆటవస్తువులు, వాకింగ్‌ట్రాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షన్ తొలి10లో 3 ర్యాంకులు రాష్ట్రంలోని మూడు మునిసిపాల్టీలకు రావడం గర్వకారణమన్నారు. నెల్లూరుకు రెండేళ్ళలో 2100 కోట్లు మంజూరుచేశామని, భూగర్భడ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ల పనులు, రోడ్లు పునర్నిర్మాణం పనులు వగైరాలన్నీ త్వరితగతిన పూర్తిచేసి నెల్లూరును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. తొలుత, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 20వ డివిజన్ కార్పొరేటర్ దాసరి రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కమిషనర్ ఆలీంబాషా, టిడిపి నాయకులు, ఆనం జయకుమార్‌రెడ్డి, తాళ్ళపాక అనూరాధ, మంత్రి ఓయస్‌డి పెంచలరెడ్డి, నారాయణ వైద్య సంస్థల ఎం.డి సింధూరి తదితరులు పాల్గొన్నారు. గతంలో ఈ పార్కు స్థలం అనిల్ గార్డెన్స్ వారు సొంత కార్యక్రమాలకు వాడుకుంటుండగా మంత్రి నారాయణ చొరవతో ఈ ప్రాంతం అందమైన పార్కుగా రూపుదిద్దుకుంది. అలాగే మంత్రి దృష్టిపెట్టి అనిల్ గార్డెన్స్ వారు ఆక్రమించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డును కూడా వారి చెర నుండి విడిపించి రోడ్డు వేయించగలిగితే ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

# అంగన్‌వాడీ విద్యార్థులకు కిట్ల పంపిణీ



నెల్లూరు, ఆకుతోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మంగళవారం విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి చేతులమీదుగా స్టేషనరీ కిట్లను పంపిణీ చేసారు. నెల్లూరురూరల్ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ ఎస్సీ సెల్ ఛైర్మెన్ డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గునపాటి రమేష్‌రెడ్డి, పాశం శ్రీనివాసులు, మధు, ఊటుకూరు దత్తాత్రేయ, ఉప్పల వెంకటేశ్వర్లు, ఉయ్యాల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.




# గూడూరు డివిజన్ వార్తలు

## వైకాపా అధికారంలోకి వస్తే...
# బీసీలకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రాబోవు రోజుల్లో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలందరికి న్యాయం జరిగేలా చేస్తామని వైకాపా జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలో జరిగిన బీసీల సదస్సును సూళ్ళూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య, తిరుపతి మాజీఎంపీ వరప్రసాద్‌రావు, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీ, సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, పలువురు బీసీ నాయకులతో కలసి ఆదివారం నిర్వహించారు. ముందుగా ప్రత్యేకహోదా కోసం ఎంపీ పదవికి రాజీనామా చేసిన మాజీ ఎంపీ వరప్రసాద్‌రావును నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకాణి, పలువురు నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి వెనుకబడిన తరగతుల పురోగతి కోసం బీసీలతో సదస్సులు నిర్వహిస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీలకు ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. జిల్లాకు మంత్రులు ఉన్నా... జిల్లా అభివృద్ధి మాత్రం పట్టడం లేదని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్మెన్ పి.శిరీషాయాదవ్, వైకాపా నాయకులు బత్తిన విజయకుమార్, కోడూరు మీరారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, నాశిన నాగులు, గిరిబాబు, తాళ్ళూరు శ్రీనివాసులు, ఉదయకుమార్, గూడూరు, సూళ్ళూరు పేట, సర్వేపల్లి, వెంకటగిరికి చెందిన పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలతో ప్రత్యేక గుర్తింపు


క్రీడలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

క్రీడలతో ప్రతి ఒక్కరూ ప్రత్యేక గుర్తింపు సాధించవచ్చని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అర్జున ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్చరి జిల్లా టోర్నమెంటులో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరులో జిల్లా స్థాయి టోర్నమెంట్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తి ప్రదర్శించారని కొనియాడారు. గెలుపొందిన క్రీడాకారులు మరింత కష్టపడి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, ప్రతినిధులు లయన్స్ క్లబ్ ప్రతినిధి కడివేటి చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి తదితరులు ఉన్నారు.

కాగా, ఆదివారం ఉదయం అర్జున ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్చరీ టోర్నమెంట్‌ను గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ శ్రీలక్ష్మి పీఎంరావు, నిర్వాహకులు రామ్మూర్తి వేణు, కౌన్సిలర్ బాలిబోయిన రమేష్, మునెయ్య, చంద్రశేఖర్, భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు లయన్స్ నోట్‌బుక్స్



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కడివేటి చంద్రశేఖర్, జి.చంద్రశేఖర్ దాతృత్వంతో ఇటీవల పోటుపాలెం గిరిజన కాలనీ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థినీవిద్యార్థులకు నోట్ బుక్స్, పెన్స్ తదితర విద్యా సామాగ్రిని రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ జాకీర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, కార్యదర్శి ఎమ్.రూపేష్‌రెడ్డి, జి.చంద్రశేఖర్, ట్రెజరర్ రవిచంద్ర, హెచ్.ఎమ్.పార్వతమ్మ, ఉపాధ్యాయురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కళాపండుగగా.. గూడూరు సంస్కృతీ సమ్మేళనం

*'గూడూరు సంస్కృతీ సమ్మేళనం'ది సుదీర్ఘ చరిత్ర. ఈ కళా సంస్థను 1954లో స్థాపించారు. సిద్దారెడ్డి జనార్ధనరెడ్డి, గండవరం సుబ్బరామిరెడ్డి, ఆవుల శ్రీనివాసరావు, చెన్నూరు కృష్ణమూర్తి, వైఎస్ రమణమూర్తి, కొండూరు వెంకటసుబ్బయ్య ఈ సంస్థ వ్యవస్థాపకులు. వీరికి అండదండగా సహకారాలందిస్తూ డివి శేషయ్య, అయితా బలరామయ్య, కెవి రమణారెడ్డి, బివి కృష్ణయ్య, డా.పి.వేణు, సివిఎస్ రాయలు, బి.రంగాచార్యులు, డా.వైజె ప్రభాకరరెడ్డి, అల్లూరు రంగారెడ్డి తదితర ప్రముఖులు ఉన్నారు. ఈ సంస్థ 64 సంవత్సరాలు పూర్తిచేసుకుని ఈ ఏడాది 65వ వసంతంలోకి అడుగుపెట్టడం సింహపురి సీమ వాసులందరికి ఎంతో గర్వకారణం. రాష్ట్రంలో ఇంతటి సుదీర్ఘచరిత్ర కలిగిన కళాసంస్థ మన జిల్లాలో ఉండడం అదృష్టం. ఎంతోమంది వదాన్యులు ఈ సంస్థ పురోభివృద్ధికి అహరహం తోడ్పడుతున్నారు. ముఖ్యంగా పెల్లేటి రాజారామిరెడ్డిది కీలకపాత్ర. కేవలం నాటికల పోటీలు నిర్వహించడమే కాక, ప్రతిఏటా అయిదురోజులపాటు ఎంతో ఘనంగా 'సాహిత్యపంచమి'ని నిర్వహించి సాహితీసేవలందిస్తున్నారు. వీటితోపాటు ఈ సంస్థ ద్వారా సంగీతనృత్య పాఠశాలను కూడా నిర్వహిస్తూ తమ కళాభిమానాన్ని చాటుకుంటున్నారు.*



## సమాజానికి మేలు చేసే సందేశాత్మక నాటికలు

గూడూరు సంస్కృతీ సమ్మేళనం ఆధ్వర్యంలో స్థానిక డివిఆర్ కమ్యూనిటీహాల్‌లో ఈనెల 12, 13, 14, 15 తేదీల్లో 65వ జాతీయస్థాయి సాంఘిక నాటికల పోటీలు జరిగాయి. సంస్కృతీ సమ్మేళనం అధ్యక్షుడు కనుమూరు హరిచంద్రారెడ్డి, కోశాధికారి జి.జి.నాయుడు, నాటక విభాగకర్త జానా శివయ్య, కార్యదర్శి కొణిదల మునిగిరీష్ నేతృత్వంలో, భట్టం శెట్టి నిరంజన్, చుట్టు అశోక్, కట్టా మురళీకృష్ణ, అద్దంకి సుబ్రహ్మణ్యం తదితరుల సహకారంతో ఈ పోటీలు జరిగాయి. నాలుగురోజుల పాటు మొత్తం 10 నాటికలు ప్రదర్శించారు. తొలిరోజు 'మధుపర్కాలు', 'జీవనయానం'తో నాటికల ప్రదర్శన ప్రారంభమైంది. ఒక సామాన్య చేనేత కార్మికుని ఔదార్యం ఎంత ఉన్నతమైనదో 'మధుపర్కాలు' నాటిక చాటిచింది. అదేవిధంగా, బిడ్డల అనాదరణకు గురవుతున్న తల్లిదండ్రుల దీనావస్థను 'జీవనయానం' కళ్ళకు కట్టింది. ధనమే ముఖ్యం కాదని, ధర్మమే ముఖ్యమని, ఎప్పటికైనాసరే ధర్మానిదే అంతిమ విజయమని తెలియజెప్పే నాటిక 'జీవనవేదం'. మరో హాస్యనాటిక 'తొక్కతీశారు' అందరినీ కడుపుబ్బ నవ్వించింది. పిసినారితనం వల్ల వచ్చే ఇబ్బందుల్ని హాస్యంతో రంగరించి చెప్పడం ఈ నాటిక ప్రత్యేకత. పెద్దలు సంపాదించిన భూములను అమ్ముకుని జల్సా చేయాలనే మనస్తత్వం వున్న పిల్లలకు చెంపపెట్టులాంటి నాటిక.. 'భూమి దుఃఖం'. అందరి ఇళ్ళలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించే రామశాస్త్రి, తన తల్లి చనిపోతే అంత్యక్రియలు చేయలేని దుర్భర పేదరికాన్ని ప్రేక్షకులు కంటతడిపెట్టేవిధంగా ప్రదర్శించిన నాటిక 'గుర్తుతెలియని శవం'. తల్లిదండ్రుల బాగోగులను చూడని పిల్లలు 'దిష్టిబొమ్మలు'తో సమానమని చెప్పే నాటిక..'దిష్టిబొమ్మలు'. కొడుకుమీదే కోర్టుకెక్కి తల్లి కొడుకుకు, కోడలికి బుద్ధిచెప్తుంది. మద్యపాన మహమ్మారి కొంపల్ని ఎలా కూలుస్తుందో తెలియజెప్పే నాటిక 'సరితా-స్వాతిముత్యం'. డప్పు సంగీతంతో ఆద్యంతం హాస్యస్ఫోరకంగా సాగి మంచి సందేశాన్నిచ్చింది. మాట ఇస్తే తప్పకూడదని, అందుకు అనేక పౌరాణిక ఉదాహరణలు చెప్తూ, కొంత జానపద వాతావరణం, కొంత సాంఘిక వాతావరణంతో మరో మంచి సందేశాన్ని ఇచ్చింది..'అనగనగా' నాటిక. తకు కులినే నాటి రాజరిక దుస్తులతో ఆనాటి వాతావరణాన్ని కళ్ళకు కట్టింది. మంత్రి పాత్రధారి (నపుంసక పాత్ర), ఆహార్యం, అభినయం అద్భుతమనిపించాడు.. ఈ నాటికలో టివి నటుడు పి.మోహనేశ్వరరావు. ఇకపోతే, ఎగ్జిబిషన్ ప్లే.. చదువుల విలువను, మాతృమూర్తి విలువను తెలియజెప్పే నాటిక..'భళా! డింగరీ'. బాలలే నటించి మెప్పించిన నాటిక ఇది. ఈ నాటిక ఈ ఏడాది నంది నాటకోత్సవాల్లో బాలల విభాగంలో రజిత నందిని అందుకుంది కూడా. ఇలా..సకల జనరంజకమైన, సందేశాత్మక నాటికల ప్రదర్శనతో ఈ ఏడాది గూడూరు సంస్కృతీ సమ్మేళనం నాటిక పోటీలు ప్రేక్షకజనావళిని బాగా ఆకట్టుకున్నాయి.

### ఉత్తమ నాటిక...'గుర్తుతెలియని శవం' :

ఎంతో రసవత్తరంగా జరిగిన ఈ నాటిక పోటీల్లో ప్రథమ బహుమతిగా, ఉత్తమ ప్రదర్శనగా 'గుర్తుతెలియని శవం' బహుమతినందుకుంది. ద్వితీయ బహుమతి 'మధుపర్కాలు', తృతీయ బహుమతి 'అనగనగా' నాటికలు అందుకున్నాయి. ఉత్తమ నటుడుగా రామశాస్త్రి పాత్రధారి వైఎస్ కృష్ణేశ్వరరావు (గుర్తుతెలియని శవం), ద్వితీయ ఉత్తమనటుడుగా సుందరయ్య పాత్రధారి జి.సాంబశివరావు (భూమి దు:ఖం), ఉత్తమ నటిగా ఇందుమతి పాత్రధారిణి గుడివాడ లహరి (గుర్తుతెలియని శవం), ద్వితీయ ఉత్తమనటిగా జానకి పాత్రధారిణి శ్రీమతి పద్మావతి (జీవనయానం), ఉత్తమ సహాయనటుడుగా పి.రంగ నాయకులు (మధుపర్కాలు), ఉత్తమ సహాయ నటిగా ఎం.లక్ష్మీ తులసి (దిష్టిబొమ్మలు), ఉత్తమ విలన్‌గా రాజుకోర్‌రు పాత్రధారి వై.హరిబాబు(భూమి దు:ఖం), ఉత్తమ హాస్యనటుడుగా వరికూటి శివప్రసాద్ (తొక్కతీశారు), ఉత్తమ బాలనటుడుగా ఎ. నందకుమార్ (దిష్టిబొమ్మలు), ఉత్తమ రచన వై.భాస్కరరావు (గుర్తుతెలియని శవం), ఉత్తమ రంగాలంకరణ శివ (మధుపర్కాలు), ఉత్తమ ఆహార్యం పి.మోహనేశ్వరరావు (అనగనగా), ఉత్తమ సంగీతదర్శకుడుగా నాగరాజు (జీవనవేదం), ఉత్తమ దర్శకుడిగా వై.ఎస్ కృష్ణేశ్వరరావు (గుర్తుతెలియన శవం) అవార్డులు అందుకోగా, ఉంగరాల బంగార్రాజు, తాళాబత్తుల వెంకటేశ్వరరావు(దిష్టిబొమ్మలు), ఆర్.వాసుదేవరావు(అనగనగా), పి.మహేశ్వరరావు(అనగనగా) ప్రత్యేక జ్యూరీ అవార్డులు అందుకున్నారు.


విజేతలకు అవార్డునందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్

- డా. గంగిశెట్టి శివకుమార్

# కౌండిన్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

## నెల్లూరు జిల్లా అడిషనల్ ఎస్పీ బి.శరత్‌బాబు



జిల్లా ఏఎస్పీ శరత్‌బాబును సత్కరిస్తున్న కౌండిన్య ట్రస్ట్ సభ్యులు

ప్రతిభావంతులైన విద్యార్థులను బాగా చదివించాల్సిన అవసరం ఎంతైనా వుందని, విద్యార్థులను ప్రోత్సహించేందుకు కౌండిన్య ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని నెల్లూరు జిల్లా అడిషనల్ ఎస్పీ బి. శరత్‌బాబు పేర్కొన్నారు. కౌండిన్య హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసి అభినందించే కార్యక్రమం ఈనెల 15వ తేది నెల్లూరు టౌన్‌హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పట్టుదలతో కృషి చేస్తే చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించగలుగుతారన్నారు. పదవ తరగతిలో పది గ్రేడ్ పాయింట్లను సాధించిన 20 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు జానా రామచంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల అభ్యున్నతి వారి పిల్లల ఉన్నత చదువుల పైనే ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాన్ని 9వ దఫా నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు ఒక మొక్కను అందజేశామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జానా రామచంద్రయ్య గౌడ్, గౌరవాధ్యక్షుడు తాతా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అన్నం దయాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఉదయగిరి నరశింహులుగౌడ్‌లతో కలసి ముఖ్యఅతిథి శరత్ బాబు ప్రతిభావంతులైన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, మెడల్ , నగదు బహుమతులను అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు ఉదయగిరి నరశింహులుగౌడ్, దద్దోలు రమణయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శి రావుల వెంకటేశ్వర్లుగౌడ్, ఆలపాక రత్నంగౌడ్, ఉదయగిరి శ్రీనివాసులుగౌడ్, దద్దోలు చక్రపాణి గౌడ్, బండ్ల రామాంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాగితాలకే పరిమితమైన బీసీ హాస్టల్ భవనం

- నూతన భవనం నిర్మించేదెప్పుడు?..
- వైఎస్సార్ విద్యార్థి విభాగం ఆవేదన


జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం

నెల్లూరు, కొండాయపాళెం గేటు వద్ద ఉన్న బీసీ హాస్టల్ భవనాన్ని పునర్నిర్మించాలని, పాత భవనం స్థానంలో నూతన భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ జేసీ వెట్రిసెల్వికి వైఎస్సార్ విద్యార్థి విభాగం ఈ నెల 17న వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జయవర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. మదన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కొండాయపాళెం వద్ద ఉన్న బిసి హాస్టల్ భవనం నిరుపయోగంగా మారడంతో దానిని అక్కడినుంచి తాత్కాలికంగా కొత్తూరులో ఒక ప్రైవేట్‌భవనానికి మార్చారని, అయితే కొత్తూరు ప్రాంతం నగర శివారుప్రాంతం కావడంతో కళాశాలలు అందుబాటులో లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని వారు పేర్కొన్నారు. కళాశాలలన్నీ నగరంలో ఉండడం వల్ల ఒక్కోవిద్యార్థి ఒక్కో కాలేజీకి వెళ్ళాలంటే నెలకు అదనంగా 1200 రూపాయల దాకా ఖర్చవుతోందని, ఈ వ్యయప్రయాసలను పేదవిద్యార్థులు భరించలేకపోతున్నారని వారు తెలిపారు. బీసీ హాస్టల్‌లో చేరే పేద విద్యార్థులు నెలకు వెయ్యి నుంచి 12వందల దాకా రానుపోను బస్సు ఖర్చులకే వెచ్చించాలంటే ఎంతో కష్టంగా ఉందన్నారు. అంతేకాక, కొత్తూరు నుంచి నిత్యం కాలేజీకి వెళ్ళేందుకు సుమారు గంటకు పైగానే సమయం పడుతోందని, ఇందువల్ల సరైన సమయానికి విద్యార్థులు కళాశాలలకు వెళ్ళలేకపోతున్నారని వారు పేర్కొన్నారు. నూతన భవన నిర్మాణాన్ని ఆరు నెలల్లోగానే చేస్తామని గతంలో అధికారులు చెప్పారని, అయితే ఇప్పటిదాకా ఆ ప్రతిపాదనలన్నీ కాగితాలకే పరిమితమైపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ ఈ విషయాలన్నీ పరిశీలించాలని, గతంలో అధికారులు చేపట్టిన బీసీ హాస్టల్ నూతన భవన ప్రతిపాదనలు ఎంతదాకా వచ్చాయో తెలుసుకుని, నూతన భవననిర్మాణం సత్వరం చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థివిభాగం నగర అధ్యక్షుడు శేషసాయి, నగర ప్రధాన కార్యదర్శి సిరాజ్, నవీన్, ప్రకాష్, ప్రదీప్, కిరణ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య రూరల్ జిల్లా కమిటీ ఎన్నిక

ఆర్యవైశ్య రూరల్ జిల్లా కమిటీ ఎన్నిక ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరులో ఉన్న శ్రీ లలితామహేశ్వరి ఆలయం ఆవరణంలో ఈ నెల 15న జరిగింది. జిల్లా అధ్యక్షునిగా తిరువీధి రాధాకృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా ముల్లంగి వెంకటేశ్వర్లు, ఇడలపాటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సొల్లేటి ప్రభాకరరావు, అదనపు కార్యదర్శిగా ఇమ్మడిశెట్టి గోవిందయ్య, అదనపు కోశాధికారిగా వాయిగండ్ల శ్రీనివాసులు ఎన్నికయ్యారు రాష్ట్రనాయకులు బత్తల మురళి, కూరపాటి సత్యనారాయణల పర్యవేక్షణలో ఈ కమిటీ ఎన్నిక జరిగింది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కొండా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు శిఘాకొల్లు నాగరాజు, ఎంపి శేషయ్య పాల్గొన్నారు.

# స్పృహ తప్పిన పనబాక లక్ష్మి

శ్రీను గల్పిక

ఢిల్లీలోని టెన్‌జనపథ్. ఒక హాల్‌లో సోనియాగాంధీ, ఏపి కాంగ్రెస్ నాయకులు రఘువీరారెడ్డి, పనబాక లక్ష్మి, పల్లంరాజు, శైలజానాథ్ తదితరులు కూర్చునివున్నారు. అందరూ దీర్ఘాలోచనలో వున్నారు. చెప్పండి పనబాకజీ... ఏపిలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలంటే ఏం చేయాలని సోనియాగాంధీ అడిగింది. అప్పుడే అక్కడకు ట్రేలో కాఫీలు తెచ్చిన సోనియా భజన సంఘం అధ్యక్షుడు వి. హెచ్.హనుమంతురావు ఆమె అడిగింది విని... ఏముందమ్మా ఏపిలోని అన్ని కాంగ్రెస్ కార్యాలయాలకు మళ్ళీ పెయింట్లు వేయిద్దాం... మళ్ళీ గతంలోలాగా కళకళలాడుతుంటాయి. దీనికి ఏషియన్ పెయింట్స్ అయితే కరెక్ట్. మా ఇంటికి నేను అవే పెయింట్స్ వాడాను అని అన్నాడు. ఆయన మాటలకు సోనియాకు చిర్రెత్తుకొచ్చి... నువ్వు కాఫీ అక్కడ పెట్టేసి వాష్‌రూమ్‌లో చాలాగిన్నెలున్నాయి, ముందు అవి కడుగుపో అని చెప్పింది. పనబాక లక్ష్మి ఉండి... ఏపిలో కాంగ్రెస్‌ను తిరిగి బ్రతికించాలంటే పోయిన నాయకులందరూ తిరిగి రావాలి మేడమ్ అని చెప్పింది. అంతలో సైక్లింగ్ పూర్తి చేసుకుని రాహుల్‌గాంధీ వచ్చాడు. రాహుల్ రాగానే రఘువీరారెడ్డి వుండి... మేడమ్ రాజకీయాలలో పరిస్థితులనే కాదు అప్పుడప్పుడూ అదృష్టాన్ని కూడా నమ్ముకోవాలి. పదేళ్ళుగా దేశంలో మన పార్టీకి బ్యాడ్ టైం నడుస్తోంది. అధికారంలో వున్నప్పుడు స్కాంలు... అధికారం కోల్పోయాక వరుస ఓటములు... రాహుల్‌కు పెళ్ళి చేసేద్దాం మేడమ్... అది కూడా మా జేసీ దివాకర్‌రెడ్డి చెప్పినట్లు బ్రాహ్మణ అమ్మాయిని చూసి చేద్దాం. గొడ్డొచ్చిన వేళ బిడ్డొచ్చిన వేళ... అంటారు. వచ్చే అమ్మాయి జాతకంతోనైనా మన పార్టీ జాతకం మారుతుందేమో అని అడిగాడు. అందుకు సోనియా... చంద్రబాబు కట్టే అమరావతి రాజధాని కన్నా క్లారిటీ వుంటుందేమో గాని, వాడి పెళ్ళిపై మాత్రం క్లారిటీ లేదు రఘురామ్‌జీ.. వాడి పెళ్ళి చూసే అదృష్టం నాకు లేదు అని పమిటచెంగుతో కన్నీళ్ళు తుడుచుకోసాగింది. అది చూసి రాహుల్... డోంట్ వర్రీ మమ్మీ... పెళ్ళి చేసుకుంటే ఎన్ని ప్రాబ్లమ్సో నీకు తెలియదు. పెళ్ళి చేసుకుంటే నేను ఇలా దేశదేశాలు తిరగగలనా... పార్టీ ఎన్నికల ప్రచారాలలో పాల్గొనగలనా? నిద్రలేచింది మొదలు అన్నీ పెళ్ళాం చెప్పినట్లు చెయ్యాలి. పాలప్యాకెట్ తేవాలి, కిరాణా కొట్టుకెళ్లి సామాన్లు తేవాలి, ఇంట్లో బూజు దులపాలి, గిన్నెలు కడగాలి, బట్టలుతకాలి... పెళ్లాం అలసిపోతే కాళ్ళు పట్టాలి... పెళ్ళి చేసుకుంటే క్షణం తీరిక లేకుండా బిజీ అయిపోతా... ఆ నరేంద్ర మోడీని చూడండి, పెళ్లాం లేకపోబట్టే కదా ఇండియాలో కంటే విదేశాలలో ఎక్కువ ఉండగలుగుతున్నాడు అని చెప్పాడు. అదంతా విని రఘువీరారెడ్డి కూడా... అబ్బాయి చెప్పిన దాంట్లో కూడా లాజిక్ వుంది మేడమ్ అని అన్నాడు. ఏంటి పొద్దున్నే మీటింగ్ అని రాహుల్ అడిగాడు. అదే బాబూ... ఏపిలో పార్టీని మళ్ళీ బ్రతికించడం కోసం ఏం చేయాలనేదానిపై మాట్లాడుతున్నాం. పోయిన వాళ్ళందరినీ తిరిగి రప్పించాలనుకుంటున్నాం అని పనబాక లక్ష్మి చెప్పింది. ఈ పని కోసం ఏపి ఇన్‌ఛార్జ్‌గా ఊమెన్ చాందిని పంపిస్తున్నాను అని రాహుల్ చెప్పాడు. అది విని శైలజానాథ్... ఊమెన్ చాందిని అంటే మహిళా నాయకురాలన్నమాట అని తన సందేహం వెలిబుచ్చాడు. సోనియాకు మండి... ఊమెన్ చాందిని అంటే లేడీ కాదు... జెంట్. కేరళ మాజీసీఎం అని చెప్పింది. రాహుల్ వుండి... ఏపిలో కాంగ్రెస్ పునరుత్తేజానికి ఏం చేయాలో నేను చూసుకుంటాను, రేపొద్దున పేపర్ చూడండని చెప్పాడు. రాహుల్ ఆ ధీమా ఇస్తే మాకు చాలంటూ అందరూ అక్కడనుండి లేచారు.

★★★★★

తెల్లారింది. అనంతపురం జిల్లా మడకసిరలోని తన ఇంట్లో వున్న రఘువీరారెడ్డి అప్పుడే నిద్రలేచాడు. వెంటనే ఆయనకు 'రేపొద్దున పేపర్ చూడండి' అన్న రాహుల్ మాటలు గుర్తుకొచ్చాయి. వెంటనే అప్పుడే వచ్చిన 'ఆనాడు' పేపర్ మడత విప్పాడు. మొదటిపేజీలో ఏమీ లేదు. పేజీ తిప్పాడు. రైట్‌సైడ్ మూడోపేజీలో ఫుల్ పేజీ ప్రకటన...

"మీ ఇంటికి తిరిగి రాగలరు" అనే పెద్ద హెడ్డింగ్ వుంది. దానిక్రింద కొన్ని ఫోటోలున్నాయి. రఘువీరారెడ్డి ఆ ఫోటోలు చూడకుండా ఆతృతగా క్రింద మేటర్‌లోకి వచ్చాడు.

ప్రియమైన కాంగ్రెస్ నాయకులారా, ఇందిరమ్మ ముద్దుబిడ్డలారా,

మీరు ఏమయ్యారో, ఎక్కడున్నారో తెలియక సోనియాగాంధీ గారు వెక్కివెక్కి ఏడుస్తున్నారు, ఆమె గత నెలరోజులుగా నిద్రాహారాలు మాని సీఎం రమేష్ తరహా డైట్ ఫాలో అవుతూ మీ కోసం ఎదురుచూస్తున్నారు. మీ కోసం ఎదురుచూస్తూ ఆమె కళ్ళు కాయలు కాస్తున్నాయి. కాంగ్రెస్ మీ తల్లి... టెన్‌జనపథ్ మీ ఇల్లు. గతంలో ఏవన్నా పొరపాట్లు జరిగివుంటే అవేమీ మనసులో పెట్టుకోవద్దు. మీరు రాకుంటే మీరెంతో ఆరాధించి అభిమానించే సోనియాగాంధీ గారు మంచం పట్టే అవకాశాలున్నాయి. ఏపిలో కాంగ్రెస్‌ను బ్రతికించుకోవాలని ఆ మహాతల్లి కలలు కంటున్నది. ఆ కలలను సాకారం చేసే శక్తిసామర్థ్యాలు మీకే వున్నాయి. కాంగ్రెస్‌ను బ్రతికించే సంజీవని మొక్కలు మీరే... కాంగ్రెస్‌కు అమృతం పోసి ఆయుష్షు నింపే ప్రాణదాతలు కూడా మీరే... మీ రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుంది. ఈ ప్రకటన చూడగానే మీరెక్కడున్నా తిరిగి రాగలరని, మీ కాంగ్రెస్ పార్టీని బ్రతికించుకోగలరని వేయి కళ్ళతో ఎదురుచూస్తూ...

ఇట్లు...

మీ... **రాహుల్‌గాంధీ**

ప్రకటన అసాంతం చదివాక రఘువీరారెడ్డి మనసులో... ప్రకటన అదిరిపోయింది.. ఇంత హృదయవిదారకంగా చదివాక కరుడుగట్టిన కసాయి అయినా తిరిగొచ్చి కాంగ్రెస్‌లే చేరాల్సిందే. ఇంతకీ ఎవరెవరి ఫోటోలు వేసారో చూద్దామంటూ ఫోటోల వైపు చూసాడు. అంతే ఆయన కళ్ళు బైర్లు కమ్మాయి. అక్కడ ఫోటోలు వరుసగా నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, అంజయ్య, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వై.యస్.రాజశేఖరరెడ్డి... మరి కొందరు దివంగతుల ఫోటోలున్నాయి. పది నిముషాల తర్వాతగాని రఘువీరారెడ్డి కోలుకోలేకపోయాడు. ఈలోకంలోకి వచ్చాక ఆయన... వెంటనే పనబాక లక్ష్మికి ఫోన్ చేసాడు. ఫోన్‌ను ఆమెకు బదులు ఆమె భర్త పనబాక కృష్ణయ్య ఎత్తాడు. లక్ష్మమ్మ లేదా అని రఘువీరారెడ్డి అడిగాడు. అందుకు కృష్ణయ్య... వుంది సార్, ఇప్పుడే 108ను పిలిపించి ఆసుపత్రికి తీసుకెళుతున్నామని ఏడుస్తూ చెప్పాడు. ఏమైందంటూ రఘువీరారెడ్డి టెన్షన్‌తో అడిగాడు. ఏమైందో ఏమో, ఆనాడు పేపర్ తీసుకుని ఏదో చదివింది.. వెంటనే స్పృహ తప్పి పడిపోయింది అని చెప్పాడు. అదేం కాదులే, నా పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే వుందని చెప్పి రఘువీరారెడ్డి ఈసారి నేరుగా రాహుల్‌కే ఫోన్ చేసాడు. రాహుల్ ఫోన్ ఎత్తగానే... ఏంది బాబూ... దివంగతులైన వాళ్ళందరి ఫోటోలు వేసి ప్రకటన ఇచ్చారు అని అడిగాడు. అందుకు రాహుల్‌గాంధీ సీరియస్‌గా... తెలిసీ తెలియకుండా మాట్లాడకండి, నిన్న మీరేగా పోయినోళ్ళందరూ తిరిగొస్తే ఏపిలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని చెప్పారు. నేను ఆ ప్రయత్నమే చేసా అని చెప్పాడు. రఘువీరారెడ్డి మనసులో... ఓర్నాయనో.... పోయినోళ్ళంటే పైకి పోయినోళ్ళు కాదు... పార్టీని వదిలి పోయినోళ్ళు... నిన్ను పప్పు అని వూరకే అనడంలేదు... నిన్ను నమ్ముకుని ఏపిలో కాంగ్రెస్‌ను బ్రతికిద్దామనుకోవడం కంటే చంద్రబాబు హయాంలోనే పోలవరం పూర్తవుతుందని నమ్ముకోవడం బెస్ట్ అనుకుంటూ రఘువీరారెడ్డి ఫోన్ పెట్టేసాడు.



# ఎన్‌బికెఆర్‌లో ఘనంగా జ్యోతి డే

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థలను స్థాపించిన జూలై 15ను ప్రతి ఏడాది విద్యార్థులు ఆ సంస్థ వ్యవస్థాపక దినంగా ఆ రోజును ఎంతో ఘనంగా 'జ్యోతి డే'గా ఎంతోకాలం నుంచి ఆనవాయితీగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15న విద్యానగర్‌లో ఆ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న ఎన్‌బికెఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ ఐఎస్టీ డైరెక్టర్ వివికె రెడ్డి మాట్లాడుతూ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఉన్నత ఆశయంతో ఈ విద్యాసంస్థలను నెలకొల్పడం జరిగిందని, ఇక్కడ చదువుకున్నవారు ఎందరో ఇప్పుడు దేశవిదేశాల్లో ఉన్నతస్థాయిల్లో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోండి

**- మాగుంట శరత్ చంద్రారెడ్డి**



నెల్లూరు పొగతోటలో ఉన్న ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కేంద్రాన్ని ఈ నెల 19న మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్ చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ బ్యూటీషియన్, టైలరింగ్, డేటా ఎంట్రీలలో శిక్షణ పొందుతున్న పలువురితో ముచ్చటించి, స్వయం ఉపాధి కోర్సులను నేటి యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాగుంట శరత్ చంద్రారెడ్డి సేవా సమితి తరపున యువత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కేంద్రం నిర్వాహకులు జహీర్ బాషా, ఆంజనేయులను అభినందించారు. స్టార్ డెంటల్ హాస్పిటల్స్ డాక్టర్ మారు హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ. ఎంఎస్ఆర్ సేవా సమితి తరపున యువతకు ఉచిత హెల్త్ క్యాంప్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఆర్ సేవాసమితి సభ్యులు సాయి తదితరులు పాల్గొన్నారు.

# అనాథలపై శ్రీనివాసరాజు 'వాత్సల్య'ం



నెల్లూరు కొండాయపాళెంరోడ్డులో ఉన్న జనహిత-వాత్సల్య నిరాధార బాలబాలికల ప్రాంగణం నిర్వహణకు కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాసరాజు తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 19న 50 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆ మేరకు చెక్కును ఎన్టీఆర్ వైద్యవిధాన పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ దయాకర్ సమక్షంలో జనహిత-వాత్సల్య సంస్థ నిర్వాహకులు సామంత గోపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ, జనహిత-వాత్సల్య సంస్థ బాలబాలికలకు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తోందని కొనియాడారు. మహనీయుడు డా.ఏపిజె అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకుని పిల్లలందరూ బాగా చదువుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ, డాక్టర్ శ్రీనివాసరాజు తన కష్టార్జితంలో కొంత మొత్తాన్ని ఇలాంటి సేవాతత్పరత కలిగిన సంస్థ అభివృద్ధికి వెచ్చించడం గొప్పవిషయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనహిత-వాత్సల్య సంస్థ కార్యదర్శి టివియస్ దుర్గాప్రసాద్, సంఘటన కార్యదర్శి జివి సాంబశివరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

# డాలస్‌లో రాజన్న పుట్టినరోజు

## - మహానేతకు నాయకుల నివాళి




దివంగత మహానేత డా.వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఉత్సవాలు ఈ నెల 15న అమెరికాలోని ప్రవాసాంధ్రులు డాలస్‌లో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపి నేతలు ఆ మహానేతకు నివాళులర్పించారు. రాజన్నతో తమకున్న అనుబంధాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషిచేసిన గొప్ప నేత డా.వైఎస్ అని, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరితో ఎంతో ఆప్యాయంగా ఉండేవారని కొనియాడారు. డా.వైఎస్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, వైఎస్ జగన్ రూపంలో అందరితో ఉన్నారని, జగన్మోహన్‌రెడ్డి కూడా డా.వైఎస్ఆర్ వలెనే విలువలకు కట్టుబడివుంటారని, పార్టీలో అందరినీ సమానంగా చూసుకుంటారని వారు పేర్కొన్నారు. జగన్ కూడా చిన్న పెద్దా తేడా లేకుండా అందరితోనూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతుంటారని వారన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు కుయుక్తులు, ఎత్తుగడలు పనిచేయవని, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని వారు ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ డా.వైఎస్ ఆపద్బాంధవుడని, తన భర్తపై అక్రమ కేసులు బనాయించినప్పుడు, తమ నియోజకవర్గంలో ప్రమాదం జరిగినప్పుడు డా.వైఎస్ తన ఢిల్లీప్రయాణాన్ని రద్దు చేసుకుని వచ్చి, కష్టసమయాల్లో తమకు అండగా ఉన్నారని దివంగత నేత డా.వైఎస్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కోడూరు ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన మహానేత డా.వైఎస్ఆర్ అని వైఎస్‌ను ప్రస్తుతించారు. అదేవిధంగా, వైఎస్ జగన్ ఎంతో నిజాయితీపరుడని, ఎన్నికల్లో గెలవడం కోసం అబద్ధపు హామీలిచ్చి ప్రజల్ని మోసపుచ్చడం ఆయనకు ఏనాడూ ఇష్టం లేదని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నేతలను వేధింపులకు గురిచేస్తోందని, వైఎస్సార్సీపి క్యాడర్‌ను నాశనం చేయాలని ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. వైఎస్సార్సీపి మహిళానేత లక్ష్మీపార్వతి మాట్లాడుతూ, తాను వేరే పార్టీ నుంచి వచ్చినా తనను అమ్మలా ఆదరించిన గొప్ప వ్యక్తి వైఎస్ జగన్ అని అన్నారు. ఒకప్పుడు దుర్యోధనుడు, ఇప్పుడు చంద్రబాబు ఇద్దరూ ఒకటేనని ఆమె ఈ సందర్భంగా చంద్రబాబును దుయ్యబట్టారు. ప్రజా సమస్యలపై జగన్ అనునిత్యం ధైర్యంగా పోరాడుతుంటే, చంద్రబాబు మాత్రం ఎన్నికల్లో గెలవడానికి ఈవిఎంల ట్యాంపరింగ్‌కు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను రౌడీలుగా చిత్రీకరించిన చరిత్ర చంద్రబాబుదని ఆమె విమర్శించారు. డబ్బుతో, పచ్చమీడియాతో చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని దుయ్యబట్టారు. వైఎస్సార్సీపి కర్నూలు ఇన్‌చార్జి హాఫీజ్‌ఖాన్, శివ అన్నపురెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ విజయం తథ్యమన్నారు. పద్మజ నిరనల్లి మాట్లాడుతూ, వెన్నుపోటు రాజకీయాలు చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని విమర్శించారు. 'లాయర్' పత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, మహానేత రాజన్నతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. డా.వైఎస్ఆర్‌లాగానే వైఎస్ జగన్ కూడా గొప్ప నాయకుడవుతాడని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాకుండా, 2024 ఎన్నికల్లో తెలంగాణలో కూడా విజయం సాధించేలా కృషిచేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, కోన రఘుపతి, పార్టీ సీనియర్ నేతలు కారుమూరి నాగేశ్వర రావు, లక్ష్మీపార్వతి, కర్నూలు సమన్వయకర్త హాఫీజ్‌ఖాన్‌లతో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ వేడుకలను డాలస్‌లోని వైఎస్సార్‌కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వైయస్సార్సీపీ అమెరికా కన్వీనర్ కొర్సపాటి శ్రీధర్‌రెడ్డితో పాటు రమణారెడ్డి కృష్ణపాటి, కృష్ణారెడ్డి కోడూరు, రమణ పొట్లూరు, ప్రసాద్‌రెడ్డి, శివ అన్నపురెడ్డి, ఉమామహేశ్వర్, శ్రీకాంత్ రెడ్డి జొన్నాల, సునీల్ దేవిరెడ్డి, ఓబుల్‌రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఈ వేడుకలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర నిర్వహించారు.

### 27 నుండి శ్రీ షిరిడి సాయిబాబా

# గురుపూర్ణిమ మహోత్సవాలు



నెల్లూరు ట్రంకురోడ్డులోని శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో ఈనెల 27 వ తేదీ నుండి ఆగస్టు నెల 5 వ తేదీ వరకు బాబా గురుపూర్ణిమ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు మందిర ఛైర్మన్ మన్నెం అమరనాథ రెడ్డి తెలిపారు. 27 నుండి ఆగస్టు 2వ తేదీ వరకు బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగుతాయన్నారు. 28 నుండి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30గంటల నుండి సామూహిక లలితా సహస్రనామ పారాయణము, దేవీ ఖడ్గమాలస్తోత్ర పారాయణం తదుపరి హనుమాన్ చాలీసా పారాయణము తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 3వతేదీ శుక్రవారం సాయంత్రం బాబావారికి పుష్పయాగం జరుగుతుందని, పుష్పయాగానికి భక్తులు బంతిపూలు తప్ప మిగతా పుష్పాలను సమర్పించవచ్చని తెలిపారు. 4వతేదీ శనివారం సాయంత్రం బాబా వారికి వివిధ రకాల పుష్పాలంకారాలతో, మంగళ వాయిద్యాలతో, సాంస్కృతిక ప్రదర్శనలతో, విద్యుత్ దీపాలంకరణలతో, బాణాసంచారాలతో వేడుకగా నగరోత్సవం జరుగుతుందని, 5వతేదీ ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు అన్నదానం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

# నెల్లూరులో రెడ్ ఎఫ్ఎం 93.5




నెల్లూరు జిల్లా ప్రజలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న ఎఫ్ ఎం రేడియో ప్రసారాలు ఈనెల 16న ప్రారంభమయ్యాయి. రెడ్ ఎఫ్ఎం 93.5ను విజేత చిత్రం హీరో కళ్యాణ్‌దేవ్ ప్రారంభించారు. నెల్లూరు అన్నమయ్య సర్కిల్ వద్ద నున్న కేవీఆర్ టవర్స్‌లో ఏర్పాటైన రెడ్ ఎఫ్ఎం స్టూడియోలో ప్రసారాలను ప్రారంభించి కొంతసేపు స్కాలర్స్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌దేవ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ప్రజలకు ఎఫ్ ఎం సేవలు అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. చాలా నగరాల్లో ప్రజలు ఎఫ్ఎం ద్వారా ఎంతో కాలక్షేపం పొందుతున్నారని, నెల్లూరు ప్రజలు కూడా ఎఫ్ ఎంలో పాటలు వింటూ కాలక్షేపం పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా రెడ్ ఎఫ్ ఎం ఎండి షణ్ముగం, జీజీఎం సుబ్బారావు మాట్లాడుతూ ప్రతిరోజు రెడ్ ఎఫ్ఎంలో నెల్లూరు సంస్కృతి, సంప్రదాయాలు, నగర విశేషాలపై ప్రసారమయ్యే కార్యక్రమాలు, సినిమా కబుర్లు, జిల్లా ప్రజలను అలరిస్తాయన్నారు. ఉదయం 7 గంటల నుంచి 11గంటల వరకు మార్నింగ్ నెంబర్ ఒన్, 11 నుంచి 2గంటల వరకు నెల్లూరు నెరజాణ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సింహపురి టాకీస్, సాయంత్రం 5 నుంచి రాత్రి 9గంటల వరకు రెడ్ రీఛార్జ్, రాత్రి 9 నుంచి 12 గంటల వరకు రెడ్ రివైండ్ కార్యక్రమాలు ప్రసారమవుతాయని తెలిపారు.

# మా సమస్యలు పట్టించుకోరా?..

- వీఎస్‌యు పరిశోధక విద్యార్థుల గోడు
- రిజిస్ట్రార్‌తో వాగ్వాదం



విఎస్‌యులోని పలువురు పరిశోధక విద్యార్థులు ఈనెల18న రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ రావును కలసి తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం సమర్పించారు. ఎన్నిసార్లు తాము వినతిపత్రాలిచ్చినా పరిశోధక విద్యార్థుల బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదని వారు తీవ్ర అసంతృప్తి చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. 5వేలు ఉండాల్సిన ఫీజును 10,200 కట్టించుకుంటున్నారని, ఇదేమి అన్యాయమని ప్రశ్నించారు. పిహెచ్‌డి కోర్సు పొడిగింపుకు దరఖాస్తు చేసుకుంటే ఫీజుతో పాటు ట్యూషన్‌ఫీజును కూడా కట్టాలంటూ ఏ యూనివర్శిటీలోనూ లేని నిబంధనల్ని పెడుతుండడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పార్ట్‌టైమ్ స్కాలర్‌లకు ప్రీపిహెచ్‌డి పరీక్షలను నిర్వహించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని వారు ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పరిశోధక విద్యార్థులు సుధీర్, మౌలాలి, మధుసూదన్, శిల్ప, జాస్మిన్, మౌనిక తదితరులు రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ, విద్యార్థులకు సంబంధించిన ఫీజులు, గదుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# నెల్లూరులో ఆర్‌ఎక్స్ 100 సందడి

నెల్లూరు లీలామహల్‌లో ఆర్‌ఎక్స్ 100 చిత్రబృందం సందడి చేసింది. ఈనెల 18వ తేది మధ్యాహ్నం చిత్రప్రదర్శనకు హాజరైన అభిమానులతో హీరో కార్తికేయ, డైరెక్టర్ అజయ్‌భూపతి మాట్లాడుతూ, ఆర్‌ఎక్స్ 100 చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రం భారీ విజయాన్ని సాధించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. కొత్తదనం ఉండే సినిమాలను నిర్మిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ బాగా ఆదరిస్తారన్నారు. ఈ సందర్భంగా హీరో కార్తికేయ ఆ చిత్రంలోని కొన్ని డైలాగ్‌లు చెప్పి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఎస్2 థియేటర్ మేనేజర్ లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ అవార్డులకు దరఖాస్తులు

దివ్యాంగుల సాధికారత 2018 జాతీయ అవార్డుల కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర సాధికారత మంత్రిత్వ శాఖ జాతీయనిధి పర్యవేక్షక కమిటీ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నిర్దేశించిన ప్రమాణాలను నెరవేర్చగల అభ్యర్థులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. దివ్యాంగ ఉత్తమ ఉద్యోగి, ఉత్తమ యజమాని, రోల్‌మోడల్, వైకల్యం కారణంగా పనిచేస్తున్న వ్యక్తి, తదితర రంగాల్లో ప్రతిభ చాటేవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# గురు దేవోభవ



(జులై 27 గురుపూర్ణిమ సందర్భంగా)

సీ : హరిహరబ్రహ్మల అవతారమూర్తియై
ఆదికవులకెల్ల ఆద్యుడగుచు
వేద విభజనంబు విమల భారతమును
అజ్ఞతన్ బోగొట్ట అందజేసి
అద్వైతంబున కాధ్యాత్మికంబున
కాచార్యుడగచును యశము గాంచి
ఆత్మ-జీవాత్మల అనుబంధమంతయు
ఒక్కటని జగతి నొక్కిచెప్పి...

తే.గీ : వేదవేద్యుడు, విజ్ఞుడు వేదమూర్తి
స్మృతి, శృతి, పురాణకర్త విశారదుండు
అనఘుడనుచు యశముగొన్న వ్యాసమౌని
వరునకు, గురుదేవునకు నా వందనములు!

కం : గురువే దైవము పూజకు
గురు సేవకు సాటిలేదు కుంభిని జూడన్
గురుతరభక్తిని గొలువగ
గురువై వ్యాసుడు మన మది కొలువైయుండున్!

- వనం సుబ్రహ్మణ్యం
ఫోన్ : 9441594897

# తప్పు.. నిప్పు.. చెప్పు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోజు రాష్ట్రానికి తీరని ద్రోహం చేసింది అప్పుడు సీఎంగా వున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి. ఢిల్లీలో విభజన ప్రక్రియ శరవేగంగా జరిగిపోతున్నా చివరి బంతి మిగిలే వుందంటూ ప్రజల్ని మభ్యపెడుతూ వచ్చి ప్రజలను నిలువునా మోసం చేసినవ్యక్తి కిరణ్. రాష్ట్ర విభజన తంతు ముగిసి, రాష్ట్రానికి జరగాల్సిన అన్యాయం జరిగిపోయాక జనం తన నెక్కడ తంతారోనని భయపడి కాంగ్రెస్ మీద కోపం నటిస్తూ బయటకొచ్చి జై సమైక్యాంధ్ర పార్టీ పేరుతో చెప్పుల పార్టీ పెట్టుకున్నాడు. రాష్ట్రం విడిపోయాక సమైక్యాంధ్ర పేరుతో పార్టీ పెట్టడమే ఆయన కుట్రకు నిదర్శనం. ఇప్పుడు మళ్ళీ ఎలక్షన్ సీజన్ వచ్చేసరికి సొంత గూటికే చేరి రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తానని బీరాలు పలుకుతున్నాడు. మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పినట్లు కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరడం వల్ల ఆ పార్టీకి అదనంగా ఒక ఓటు పెరిగింది తప్పితే ఇంకేమీ ఒరగదు.

ఈయన కాంగ్రెస్‌లో చేరీ చేరగానే జగన్‌ను అడ్డుకుంటామని స్టేట్‌మెంటిచ్చాడు. జగన్‌ను అడ్డుకుని చంద్రబాబును మళ్ళీ సీఎంను చేద్దామనే ఈయన కాంగ్రెస్‌లోకి వచ్చాడా? ఎందుకంటే కాంగ్రెస్‌కు ఎలాగూ ఇక్కడ సీన్ లేదు. అది కిరణ్‌కు కూడా తెలుసు. అయితే తెలుగుదేశమా? లేకుంటే వైయస్సార్ కాంగ్రెస్సా... గెలుపోటములు ఈ రెండు పార్టీల మధ్యే వుంటాయి. మరి కిరణ్‌కుమార్‌రెడ్డి జగన్‌ను అడ్డుకుంటామని చెప్పడమంటే తెలుగుదేశానికి మద్దతునిస్తున్నట్లే కదా!

అదృష్టం కొద్ది ముఖ్యమంత్రి అయిన నాయకుడు కిరణ్! 2009 ఎన్నికల్లో పీలేరు నియోజకవర్గం నుండి బొటాబొటి మెజార్టీతో గెలిచాడు. ఆ ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యతిరేకంగా చేసుంటే ఓడిపోయి వుండేవాడు. కాని, వై.యస్. గట్టిగా చెప్పబట్టి పెద్దిరెడ్డి పీలేరులో కిరణ్‌కు అనుకూలంగా పనిచేశాడు. అప్పుడు ఉన్నతాధికారుల సహకారం కూడా వుండింది. కాబట్టే తక్కువ ఓట్లతోనైనా గెలిచాడు. వై.యస్. కొలువులో స్పీకర్ అయ్యాడు. స్పీకర్ కావడమే ఆయనకు వరమైంది. వై.యస్. మరణం తర్వాత రోశయ్య సీఎం అయినా ఎక్కువ కాలం పనిచేయలేకపోయాడు.

కాంగ్రెస్ అధిష్టానం ఏపి విభజన ప్లాన్‌ను 2010లోనే ప్రభుత్వానికి పంపింది. అయితే సీఎంగా వున్న రోశయ్య... తన హయాంలో ఆ పాపం జరిగితే చూడలేనని విభజనకు తాను వ్యతిరేకమని చెప్పడంతో, విభజనకు అన్ని విధాలా సహకరిస్తానని చెప్పిన కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆయన స్థానంలో కూర్చోబెట్టింది. 2013 చివర్లో విభజన ప్రక్రియ మొదలయ్యాక విభజనకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు కిరణ్ కలరింగ్ ఇస్తూ వచ్చాడు. కిరణ్‌కుమార్‌రెడ్డి విభజనను బలంగా అడ్డుకుంటాడని ప్రజలు భ్రమపడ్డారు. చివరి బంతి మిగిలేవుందంటూ విభజన చివరి క్షణం దాకా రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి చివరకు నిలువునా ముంచేసాడు.

ఏ వై.యస్. పుణ్యాన అయితే సీఎం స్థాయికి వెళ్లాడో అదే వై.యస్. కుటుంబానికి వ్యతిరేకంగా అధిష్టానం పన్నిన కుట్రలను అమలు చేయడంలో కిరణ్ తనవంతు సహకారం అందించాడు. జగన్ పై కేసులు నమోదు, విచారణ, జైలుకు పంపడం వంటి అన్ని ప్రక్రియలలోనూ కిరణ్ హస్తముంది. కిరణ్ ప్రభుత్వం పడిపోకుండా అప్పట్లో కాపాడింది చంద్రబాబు కాబట్టి... ఇప్పుడు చంద్రబాబుకు కిరణ్ తనవంతు సాయమందిస్తున్నాడు. అందుకే జగన్ టార్గెట్ అంటూ ఈ చిత్తూరు జోడు నేతలు తోడల్లుళ్ళులాగా కలిసిపోయారు.

# జోడుగుర్రాలపై నారా వారి సవారీ

(మొదటి పేజీ తరువాయి)

వెర్రివెంగళప్పలవుతున్నారు. అప్పట్లో కాంగ్రెస్, తెలుగుదేశంలు జగన్‌పై కక్షగట్టి కేసులు సృష్టించి ఆయనను జైలుకు పంపాయి. ఈరోజు కేంద్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తే చంద్రబాబు చాలా అంశాలలో బుక్కవుతాడు. పోలవరం ప్రాజెక్ట్ అంచనాలలో ఎన్ని బొక్కలున్నాయన్నది మొన్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకే తెలిసుండాలి. భూసేకరణ నష్టపరిహారాన్ని 11రెట్లు పెంచడమన్నది వరల్డ్ రికార్డ్. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా చూడని అవినీతిని గడ్కరీ పోలవరం నిర్మాణంలో చూసుంటాడు. 'ఓటు-నోటు' కేసుపై కేంద్రం దృష్టి పెట్టి వున్నా చంద్రబాబుకు చిక్కులు తప్పవు. ఈ కేసు మూలన పడి వుంది. వైసిపికి చెందిన ముగ్గురు లోక్‌సభ సభ్యులు టీడీపీలోకి ఫిరాయించారు. లోక్‌సభ స్పీకర్ ఏ మాత్రం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేసివున్నా ఈపాటికి ఈ ముగ్గురిపై వేటుపడుండేది. కాని, బీజేపీ ఆ విధంగా చేయలేదు. అంటే ఆ పార్టీ టీడీపీని పూర్తిగా దూరం చేసుకోలేదు. అమరావతి రాజధాని మొదలుకొని విదేశీ టూర్లు, పుష్కరాలు, పట్టిసీమ... ఇలా ఏది చూసినా అవినీతి అక్రమాల గుట్టలే! కేంద్రం పూర్తిస్థాయిలో దృష్టిపెడితే చంద్రబాబుకు చుక్కలు చూపించడం పెద్ద సమస్య కాదు. కాని, బాబుతో కొనసాగుతున్న అంతర్గత సాన్నిహిత్యం వల్లే బీజేపీవాళ్ళు ఆయనపై దాడి చేయలేకున్నారు.

వచ్చే ఎన్నికలనాటికి రాష్ట్ర రాజకీయాలలో ఏదైనా జరగొచ్చు. వ్యతిరేక ఓటును చీల్చేందుకు కాంగ్రెస్‌ను రెచ్చగొట్టొచ్చు. అనుకూల ఓటు చీలకుండా వుండేందుకు మళ్ళీ బీజేపీ, జనసేనలతో అంటకాగొచ్చు. చాలా ముందుచూపుతోనే చంద్రబాబు ఏ దారినీ పూర్తిగా మూసేయకుండా వున్నాడు.

## బయటపడ్డ రహస్య మైత్రి...

టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభ స్పీకర్ ఆమోదించడం వెనుక కూడా ఈ రెండు పార్టీల రహస్య మైత్రి బయటపడుతోంది. ప్రత్యేకహోదా కోసం పోరాడుతూ వైసిపి 13సార్లు అవిశ్వాస తీర్మాణం నోటీసులిచ్చినా స్పీకర్ ఆమోదించలేదు. ప్రత్యేకహోదా డిమాండ్ తోనే 5మంది వైసిపి ఎంపీలు రాజీనామాలు చేసారు. ఇప్పుడు వాళ్ళు లోక్‌సభలో లేరు. టీడీపీ వాళ్ళు ప్రత్యేకప్యాకేజీకి ఒప్పుకుని ప్రత్యేకహోదా కోసం ఏనాడు పార్లమెంటులో పోరాడలేదు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ చూసిన తర్వాతే టీడీపీ ఎంపీలు బీజేపీకి వ్యతిరేకంగా గళం విప్పారు. ప్రత్యేకహోదా కావాలంటున్నారు. కాని పార్లమెంటులో ప్రత్యేకహోదా కోసం నాలుగేళ్ళుగా పోరాడింది వైసిపి ఎంపీలే! ఈ నాలుగేళ్ళు వాళ్ళు కోరితే ఏ రోజూ స్పీకర్ అవిశ్వాసతీర్మానంపై చర్చకు అనుమతివ్వలేదు. ఇప్పుడు టీడీపీ సభ్యులు అడిగీ అడగంగానే అనుమతినిచ్చారు. ఇది రహస్య బంధంలో భాగమై ఉండొచ్చు.

అయితే ఇంకో అనుమానం లేకపోలేదు. అవిశ్వాస తీర్మానాన్ని బీజేపీ అంత సులభంగా అనుమతించదు. వాళ్ళకు పక్కా ప్రణాళిక ఉండొచ్చు. అవిశ్వాస తీర్మానంపై పార్లమెంటులో శుక్రవారం జరిగే చర్చలో అటు కాంగ్రెస్‌ను ఇటు టీడీపీని కంబైన్డ్‌గా ఉతికి ఆరేసే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్ర విభజన బిల్లు విషయం తీసుకుంటే ఏపికి ప్రత్యేక హోదా అంశాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులో చేర్చలేదు. ఆరోజు మీరు బిల్లులో పెట్టుంటే ఈరోజు మేము అమలు చేయడానికి ఆస్కారం ఉండేదని వాదించవచ్చు. విభజన బిల్లు విషయంలో కాంగ్రెస్ నోరు మూయించడానికి బీజేపీకి అవకాశముంది.

అదే సమయంలో టీడీపీ తీరును ఎండగట్టవచ్చు. ప్రత్యేకహోదా బదులు ప్రత్యేకప్యాకేజీ కావాలన్నది చంద్రబాబే! కేంద్రం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిన తర్వాత కేంద్రానికి ధన్యవాదాలు తెలుపుతూ అసెంబ్లీ తీర్మానం కూడా చేసింది. ఇక విభజన బిల్లులో పేర్కొన్న పలు కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్నాయి. అలాగే పోలవరం ప్రాజెక్ట్‌తో పాటు అందులో ఇమిడివున్న అక్రమాలను కూడా సభాముఖంగా బయటపెట్టేందుకు బీజేపీకి అవకాశముంది. ఏపిలో ప్రభుత్వ అవినీతిని, చంద్రబాబు ద్వంద్వప్రమాణాలను ఎండగట్టేందుకు బీజేపీవాళ్ళు అవిశ్వాస తీర్మానంపై చర్చను వాడుకున్నా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.!

# ఇన్‌ఛార్జ్‌లతో ఇబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

చూడడం వరకే! కాని, వైసిపి ఇన్‌ఛార్జ్‌లలో వచ్చే ఎన్నికలలో తామే అభ్యర్థులమనే ఫీలింగ్ వచ్చేసింది. దీనికితోడు నాలుగున్నరేళ్ళుగా వాళ్ళు అంతో ఇంతో పార్టీ కోసం ఖర్చు పెట్టుకుంటూ వచ్చారు. ఇప్పుడు కొత్త నాయకులు వస్తే వీళ్ళకు సమస్యగా వుంది. వాళ్లొచ్చి తమ సీట్లకు ఎసరుపెడతారన్న భయంతో ఇన్‌ఛార్జ్‌లు ఎక్కడికక్కడ కొత్త నాయకులను రాకుండా అడ్డుకుంటున్నారు. ఇక ఎన్నికల సీజన్ మొదలుకానుంది. అటు ఇటు వలసలు భారీగా వుంటాయి. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీల నుండి వైసిపిలోకే వలసలు ఎక్కువగా వుండే అవకాశముంది. జిల్లాకు ఒకరిద్దరు బలమైన నాయకులు వైకాపాలో చేరే సూచనలున్నాయి. రేపు ఎన్నికల్లో వైకాపాకు గెలుపు గుర్రాలు ముఖ్యం. కేవలం వై.యస్. గాలి, చంద్రబాబు వ్యతిరేకతే పూర్తిగా పార్టీని గెలిపించలేవు. అభ్యర్థులు కూడా కొంత సమర్థులైవుండాలి. కాబట్టి పార్టీ గెలుపు కోసం ఇతర పార్టీల నుండి వచ్చే గట్టి నాయకులను తీసుకోక తప్పదు. కేవలం వైకాపాలో ఇన్‌ఛార్జ్‌ల సమస్యల వల్లే కొందరు నాయకులు వైసిపిలోకి రావడం ఆగిపోయినట్లుగా తెలుస్తోంది.

వైసిపికి రేపు గెలుపు గుర్రాలు ముఖ్యం. అధికారం వచ్చిందంటే ఇన్‌ఛార్జ్‌లుగా కష్టపడిన వాళ్ళకు ప్రత్యామ్నాయం చూడవచ్చు. అంతేగాని గట్టి అభ్యర్థులు కాలేరని తెలిసిన ఇన్‌ఛార్జ్‌లకు జగన్ సీట్లిచ్చుకుంటూ, కొత్త నాయకులను పార్టీలోకి తీసుకోకపోతే 2014 ఎన్నికల ఫలితాలకు రేపటి ఫలితాలకు పెద్ద తేడా కనిపించకపోవచ్చు.

# శ్రావణంలో వైసిపిలోకి ఆనం

- జగన్‌తో భేటీ అయిన రామనారాయణ
- సీటుపై ఇంకా వీడని చిక్కుముడి



మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అనే నాయకుడు ఇప్పుడు నెల్లూరుజిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా ఉన్నాడు. ఆయన ఎప్పుడు వైసిపిలో చేరతాడన్నది గత కొన్ని నెలలుగా జరుగుతున్న చర్చ. తెలుగుదేశంలో వుండేది లేదని ఈమధ్యనే ఆయన తేల్చి చెప్పాడు. టీడీపీవాళ్ళు ఆయనను దాదాపుగా వదిలేసుకుని ఆయన స్థానంలో ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా కొత్త నాయకుడి కోసం అన్వేషిస్తున్నారు. ఆనం తట్టాబుట్టా సర్దేసుకుని వైసిపి గూటికి చేరడానికి మార్గం మధ్యందాకా వచ్చేసాడు. తీరా వైసిపికి చేరువగా వచ్చాక, ఇక్కడ మారిన రాజకీయ పరిస్థితులతో ఆయన వేగంగా ముందుకు అడుగులు వేయలేకపోయాడు.

మొదట వైసిపిలో సీటుపై క్లారిటీ లేదు. ఏ సీటు ఇస్తామన్నది తేల్చలేదు. అసలు సీటుకు గ్యారంటీ కూడా ఇవ్వడం లేదు. జగన్‌ను సీఎంను చేయడానికి అవసరమైతే తన సీటునైనా త్యాగం చేస్తానంటూ కొద్దిరోజుల క్రితం మేకపాటి గౌతంరెడ్డి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించాడు. అయితే వైసిపికి అధికారం వచ్చే అవకాశాలున్న తరుణంలోనే సీటు ఎట్లా వదులుకుంటావురా వెర్రోడా... అని తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి చీవాట్లు పెట్టడంతో గౌతం మళ్ళీ మనసు మార్చుకున్నాడు. ఆత్మకూరు సీటు నుండే తాను పోటీ చేస్తానని, ఈ సీటును వదిలే సమస్యే లేదని ప్రకటించుకున్నాడు. ఆనం రామనారాయణరెడ్డి వైసిపిలో చేరితే ఆయనకు అవకాశముండేది ఆత్మకూరు నియోజకవర్గమే! దీనిపై గౌతం గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయమై జగన్‌తో గట్టిగా వాదించాడని సమాచారం. ఆత్మకూరు కాకపోతే ఆనం రామనారాయణరెడ్డికి వున్న రెండో ఛాన్స్ వెంకటగిరి. ఇక్కడైనా ఆనం గట్టి అభ్యర్థే! అయితే ఇక్కడ సీటు విషయమై జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి గట్టిగా పట్టి వున్నాడు. 2014 ఎన్నికల్లో ఇక్కడ వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఆ తర్వాత పార్టీని వదిలేసాడు. అప్పుడు ఎవరూ దొరకని పరిస్థితుల్లో బొమ్మిరెడ్డిని వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. దాదాపు నాలుగేళ్ళపాటు బొమ్మిరెడ్డి రాఘవ వెంకటగిరి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చూస్తూ వైసిపి శ్రేణులకు టచ్‌లో వుంటున్నాడు. ఇక్కడ పార్టీ కార్యక్ర మాలన్నీ కూడా ఆయన నాయకత్వంలోనే జరుగుతున్నాయి. ఇంతదూరం వచ్చాక ఆయన సీటును వదులుకోవడానికి సిద్ధంగా లేడని తెలుస్తోంది. బొమ్మిరెడ్డిని ఒప్పించి ఆనం రామనారాయణ రెడ్డికి సీటివ్వడం కూడా అంత సులభమైన విషయం కాదు.

అయినా కూడా ఎట్టకేలకు ఈ నెల 19వ తేదీన హైదరాబాద్ లోని లోటస్‌పాండ్‌లో జగన్మోహన్‌రెడ్డితో ఆనం రామనారాయణ రెడ్డి భేటీ అయ్యాడు. ఏ సీటు అన్నది క్లారిటీ లేకుండానే ఆయన పార్టీలో చేరడానికి సిద్ధపడ్డాడని సమాచారం. పార్టీలో ఇంతవరకు ఎవరికి కూడా సీటు కన్ఫార్మ్ చేయలేదు కాబట్టి ఎలక్షన్ నాటికి పరిస్థితిని బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని ఆనంకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భేషరతుగానే పార్టీలో చేరడానికి ఆనం అంగీకరించాడని, ఆషాడం వెళ్ళాక శ్రావణ మాసంలో మంచిరోజు చూసుకుని చేరొచ్చని సమాచారం.

# జనం లేరు.. సైన్యం లేదు..

## • ప్రజారాజ్యం ప్రతిరూపమే జనసేన!

జనసేన... ఒకప్పటి ప్రజారాజ్యం పార్టీకి ప్రతిరూపం. కాకపోతే అధిపతులు మారారు. అప్పుడు మెగాస్టార్ చిరంజీవి అయితే ఇప్పుడు తమ్ముడు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్. 2008లో ప్రజారాజ్యం పార్టీని పెట్టిన మెగాస్టార్ చిరంజీవి 2010కల్లా ఆ పార్టీని మూసేసుకోవడం తెలిసిందే! 2009 ఎన్నికల్లో పోటీచేసి 18అసెంబ్లీ సీట్లను గెలుచుకున్న ప్రజారాజ్యం పార్టీ, రాష్ట్రంలో చాలా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయాలకు గండి కొట్టింది. 2009లో ప్రజారాజ్యం పోటీ చేయకపోయి వుంటే కాంగ్రెస్‌కు 180 నుండి 190 సీట్లు వచ్చుండేవి. ఆ పార్టీ మధ్యలో వుండబట్టే కాంగ్రెస్ 155సీట్లకే పరిమితమైంది.

ఇప్పుడు ప్రజారాజ్యంకు ప్రతిరూపమే జనసేన. మెగా అభిమానులే పవర్ స్టార్ అభిమానులు. ఇక కులపరమైన బలం కొంతవుంటుంది. నెల్లూరు జిల్లా రాజకీయాలపై జనసేన ప్రభావం ఎంతుంటుందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా వుంది. 2009లో ప్రజారాజ్యంకు జిల్లాలో కొద్దోగొప్పో బలం వుండింది. ఆ పార్టీలో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, అజీజ్, ద్వారకానాథ్ వంటి నాయకులుండినారు. ప్రతి నియోజకవర్గంలోనూ తెలిసిన నాయకుడు ఒకడన్నా వున్నాడు.

ఇప్పుడు జిల్లాలో జనసేనకు ఆ మాత్రం నాయకత్వం కూడా లేదు. రాజకీయంగా చెప్పుకోదగ్గ నాయకుడు ఒక్కడూ ఆ పార్టీలో లేడు. నెల్లూరు నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో కూడా పవన్ అభిమానులున్నారు. కాని స్థానికంగా బలమైన నాయకత్వం అన్నది లేకుండా ఆ పార్టీ రాజకీయంగా ఎలా పోరాడగలదు. ఇప్పటివరకు చూస్తే జిల్లాలో ఆ పార్టీ ఉనికి నామమాత్రమేననుకోవచ్చు.



స్వామి పరిపూర్ణానంద హైదరాబాద్ నగర బహిష్కరణకు నిరసనగా ఈ నెల 19వ తేదీన నెల్లూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న విహెచ్‌పి, భజరంగ్‌దళ్ కార్యకర్తలు

# పచ్చదనం పరిరక్షణలో నారాయణ కాలేజీ ఫస్ట్



సిఎం చేతుల మీదుగా బెస్ట్ అవార్డు అందుకున్న నారాయణ గ్రూప్ ఎం.డి డా. సింధూర

పచ్చదనం పరిరక్షణ కోసం ఒక ఉద్యమంలా కార్యక్రమాలు నిర్వహించినందుకు 'వనం–మనం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీవారు ప్రధమ బహుమతిని అందుకున్నారు. నారాయణ గ్రూప్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సింధూర నారాయణ ఆ మేరకు ముఖ్యమంత్రి నుంచి ఈ అవార్డును అందుకున్నారు. నూజివీడులో ఇటీవల జరిగిన వనం–మనం కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ అంశానికి సంబంధించి పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నారాయణ మెడికల్ కాలేజీలో పచ్చదనం పరిరక్షణకు అమలుపరచిన విధానం బావుందని, పచ్చదనం పరిరక్షణలో నారాయణ వైద్యకళాశాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డాక్టర్ సింధూర నారాయణ మాట్లాడుతూ నారాయణ మెడికల్ కాలేజీలో పచ్చదనం ఒక్కరోజులో వచ్చింది కాదని, నూరు ఎకరాలకు పైగా ఉన్న విస్తీర్ణంలో భవన నిర్మాణాల కంటే ముందుగానే చెట్లు నాటి, వాటిని కంటికి రెప్పలా సంరక్షించామన్నారు. అనంతరం అవసరమైన మేరకు ఒక్కో భవనాన్ని చెట్లమధ్య నుంచి నిర్మించామన్నారు. కొన్నేళ్ళుగా ఇలా పచ్చదనం పరిరక్షణకు చేసిన కృషి ఫలించిందన్నారు. ప్రభుత్వం గుర్తించి అవార్డును ఇవ్వడం, అది కూడా తమకు రోల్‌మోడల్ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకోవడం తమకెంతో గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, దేవినేని ఉమ, శిద్దా రాఘవరావు, కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com